సూర్య
www.suryaa.com
బుధవారం 01 అక్టోబర్ 2025
వైఎస్ఆర్ కడప
పేజీలు - 08





# కార్పొరేషన్‌లో కమీషన్ల దందా

ఇంజనీరింగ్ సెక్షన్‌లో తారాస్థాయికి చేరిన అవినీతి




- ఆగిపోయిన 15వ ఆర్థిక సంఘం కాంట్రాక్టు బిల్లులు?
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న కాంట్రాక్టర్లు, టీడీపీ ద్వితీయశ్రేణీ నేతలు
- పని విలువను బట్టి ముందే కమీషన్ల వసూళ్ళు
- లేకుంటే ఎం-బుక్ మూలకే..
- గత నిబంధనలకు విరుద్ధంగా రూ.లక్ష బిల్లు సైతం ఎస్ఈ దృష్టికి..
- ఫలితంగా బిల్లుల చెల్లింపులో ఉద్దేశ్యపూర్వక జాప్యం
- కమీషన్ లెక్కకట్టి బహిరంగ దోపిడీ

కడప బ్యూరో - మేజర్‌న్యూస్

కడప కార్పొరేషన్‌లో పాలన అస్తవ్యస్తంగా మారింది. పాలక వర్గం - ఎమ్మెల్యే మాధవీరెడ్డి మధ్య సాగుతున్న ఆధిపత్యపోరును అలుసుగా తీసుకుని అధికార యంత్రాంగం ఇష్టానుసారంగా వ్యవహరిస్తోంది. కార్పొరేషన్‌లోని కొన్ని విభాగాల్లో దోపిడీకి అడ్డు అదుపులేకుండా పోయింది. కమీషనర్ పాలనా వ్యవహారాలను పూర్తిగా పట్టువిడిచినట్లు కనిపిస్తోంది. ఉనికి చాటుకునేందుకే నానాపాట్లు పడుతున్నారు. దీంతో సిబ్బంది అందినకాడికి దోచుకుంటున్నారు. పేట్రేగిపోతున్నారు. 15వ ఆర్థిక సంఘం పనులను అడ్డుపెట్టుకుని కాంట్రాక్టర్లను పీల్చి పిప్పి చేస్తున్నారు. రూ.లక్ష విలువైన బిల్లు కూడా తమవద్దకు రావాల్సిందేనని హుకుం జారీ చేసిన ఇంజనీరింగ్ సెక్షన్ ఉన్నతాధికారి తమ కమీషన్ లెక్కకట్టి బలవంతంగా వసూలు చేస్తున్నారు. లేకుంటే ఎం-బుక్ చూడకుండానే తిరస్కరిస్తున్నట్లు తెలుస్తోంది. బహిరంగంగానే సాగుతున్న మామూళ్ళ వ్యవహారాన్ని చూసి కేశవా.. ఏమిటీ అవినీతి అంటూ కాంట్రాక్టర్లు చేతులెత్తి మొక్కుతున్నారు.

కడప కార్పొరేషన్ పరిధిలో సుమారు 4లక్షల పైచిలుకు జనాభా ఉంది. కార్పొరేషన్‌లో అభివృద్ధి పనులకు సంబంధించి 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదలయ్యాయి. 2021-22 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి 1, 2వ విడత, 2022-23 ఆర్థిక సంవత్సరం మొదటి విడతకు రూ.238.30 లక్షలతో 36 పనులు, 2022-23కు సంబంధించి 2వ విడత రూ.411.25 లక్షలు, 2023-24 మొదటి విడతకు సంబంధించి రూ.418.24 లక్షలతో 34 పనులతో కలిపి రూ.1067.79 లక్షలతో 127 పనులు మంజూరయ్యాయి. ఇందులో 59 సీసీ రోడ్లు, డ్రైన్స్, 74 సీసీ రోడ్లు, 8 చోట్ల తాగునీటి సరఫరా మిగతా 2పేజీలో

# ఇప్పపెంట భూమిపై వివాదం



- సర్వే నంబర్ 274లోని 28 ఎకరాల భూమిపై ఉద్రిక్తత?
- దలితులకు వ్యవసాయం చేసుకునే హక్కు లేదా?
- ఆక్రమించిన వారికి అధికారులు సహకరిస్తున్నారా?
- ఫిర్యాదు చెయ్యాలంటే బ్రతికి ఉన్న పత్రం ఉండాల్సిందేనా?
- గ్రామ స్థాయి అధికారి మనసులో ఏముంది?
- డికెటి భూములపై మాదిగలు, మైనారిటీలకు న్యాయం చేయాలి
- యం.ఆర్.పి.యస్, రెవల్యూషనరీ పార్టీ డిమాండ్

చింతకొమ్మదిన్నె మేజర్‌న్యూస్: చింతకొమ్మదిన్నె మండలంలోని ఇప్పపెంట పంచాయతీ పరిధిలోని ఇప్పపెంట రెవెన్యూ గ్రామంలో ఉన్న సర్వే నంబర్ 274లోని 28 ఎకరాల ప్రభుత్వ డీ.కె.టి. భూములు ప్రస్తుతం తీవ్ర వివాదాస్పదంగా మారాయి. 1999లో ఈ భూములను భూమిలేని పేదలకు కేటాయించేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దాని ప్రకారం ఇప్ప పెంట గ్రామానికి చెందిన 22 మంది దలితులు, మైనారిటీలకు ఒక్కొక్కరికి వార్త 2వ పేజీలో

# నగరంలో పోలీస్ స్టేషన్లను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ



కడప క్రైమ్ మేజర్‌న్యూస్: కడప నగరంలోని వన్ టౌన్ పోలీస్ స్టేషన్, కమాండ్ కంట్రోల్ సెంటర్, టూ టౌన్ పోలీస్ స్టేషన్‌లను మంగళవారం ఆకస్మిక జిల్లా ఎస్పీ నచికత్ విశ్వనాథ్ తనిఖీ చేశారు. వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో రికార్డులు పరిశీలించి నేరాలు జరగకుండా అప్రమత్తంగా విధులు నిర్వహించాలని వార్త 8వ పేజీలో



## మహిళల ఆరోగ్యం కోసమే స్వస్థ్ నారి సశక్త్ పరివార్ అభియాన్



**ఎర్రగుంట్ల, మేజర్‌న్యూస్ :** మహిళల ఆరోగ్యం కోసమే స్వస్థ్ నారీ సశక్త్ పరివార్ అభియాన్ కార్యక్రమాన్ని ప్రభుత్వం నిర్వహిస్తుందని పీహెచ్ సీ వైద్యాధికారిణి జ్యోష్ణ అన్నారు. పట్టణ పరిధిలోని మంగళవారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో నిర్వహించిన శిబిరాన్ని మున్సిపల్ కమిషనర్ శేషఫణి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలు, పిల్లల ఆరోగ్యం కోసం ప్రత్యేక వైద్య శిబిరాలను కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా కుటుంబ సంక్షేమ శాఖ ద్వారా సెప్టెంబర్ 17 నుంచి అక్టోబర్ రెండవ తేదీ వరకు రెండు వారాలపాటు జరుగుతున్నాయని అన్నారు. ఆరోగ్యమైన మహిళలు బలమైన కుటుంబం గురించి ప్రజలకు వివరించారు. మహిళల ఆరోగ్యంపై అవగాహన, మహిళలకు సమ యానకుల వైద్య సేవలు అందించడం. పోషకాహారాన్ని ప్రోత్సహించడం. కుటుంబాలను స్వశక్తి చేయడం ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశం అని అన్నారు. రక్తపోటు మధుమేహం నోటి క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్లను, మహిళలు, కిశోర బాలికలలో రక్తహీనత గురించి తగిన చికిత్సలు, గర్భవతులను పరీక్షించి సరైన పోషకాహారం ఆవశ్యకతను తీసుకోవలసిన జాగ్రత్తల గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో స్పెషలిస్ట్ డాక్టర్లు, డిప్యూటీ హెల్త్ ఎడ్యుకేషన్ అధికారి వెంకటేశ్వర్లు, నాగమణి రెడ్డి, హెచ్ ఈ ఓ రవిశంకర్ రాజు, సూపర్వైజర్ ఓబులేసు, అంగన్వాడి సూపర్వైజర్‌లతోపాటు సిబ్బంది పాల్గొన్నారు.

## జడలమారెమ్మ వీధిలో మొదటిసారి శరన్నవరాత్రి మహోత్సవాలు



**కడప, మేజర్‌న్యూస్:** కడప జిల్లా చిన్న చౌక్‌లోని జడల మారెమ్మ వీధిలో మొట్టమొదటి సారి శరన్నవరాత్రి మహోత్సవాలు అత్యంత భక్తిశ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. తొలిసారిగా నిర్వహిస్తున్న ఈ ఉత్సవాలు స్థానిక భక్తులకు ప్రత్యేక ఆకర్షణగా మారాయి. ఈ మహోత్సవాల సందర్భంగా ప్రతి రోజు ఉదయం అమ్మవారికి అభిషేక సేవలు నిర్వహించబడుతున్నాయి. సాయంత్రం వేళలలో కుంకుమార్చన కార్యక్రమం వేడుకలతో కూడి కొనసాగుతోంది. భక్తులు పెద్దఎత్తున హాజరై అమ్మవారిని దర్శించుకుంటున్నారు. ఈ కార్యక్రమాల నిర్వహణ బాధ్యతను ప్రధాన అర్చకులు, శరవరా గో సేవా సమితి అధ్యక్షులు కరవడి రవికుమార్ స్వయంగా నిర్వర్తిస్తున్నారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించడంలో హేమంత్, భరత్, హరి, మనోజ్, రవి, రాజ, గడికోట రెడ్డయ్య తదితరులు కృషి చేశారు. ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై, అమ్మవారి కృపకు పాత్రులు అవుతున్నారు. వచ్చే రోజుల్లో మరిన్ని ప్రత్యేక కార్యక్రమాలు జరగనున్నాయని నిర్వాహకులు తెలిపారు.

## శిల్పారామాన్ని సందర్శించిన రిమ్స్ సీఐ



**కడప టౌన్, మేజర్‌న్యూస్:** కడప శిల్పారామాన్ని రిమ్స్ సర్కిల్ ఇన్స్పెక్టర్ వై.రామ కృష్ణారెడ్డి మంగళవారం సందర్శించారు. శిల్పారామం పరిపాలన అధికారి ఎస్.కృష్ణ ప్రసాద్ తో సీఐ పలు విషయాలపై చర్చించారు.ఎన్ని సీసీ కెమెరాలు ఉన్నాయని అడిగి తెలుసుకుని,ఆ కెమెరాలను పరిశీలించారు.అలాగే కొన్నిచోట్ల సీసీ కెమెరాలను కొత్తగా అమర్చాలని సూచించారు. శిల్పారామం సెక్యూరిటీ సిబ్బందిని పెంచుకోవాలని పరిపాలన అధికారికి తెలిపారు. అనంతరం సాంస్కృతిక కళా వేదిక పై మిస్పా మూవీ మీడియా వారి సహకారంతో నగరానికి చెందిన కిషోర్ డాన్స్ అకాడమీ విద్యార్థిని,విద్యార్థులచే పల్లె జానపదాలు, శాస్త్రీయ నృత్యాలు, సినీ నృత్యాలు తో ప్రేక్షకులను అలరించారు. చక్కటి హావభావాలతో ఆయా పాటలకు తగ్గట్లు నర్తించారు. ఈ కార్యక్రమం శిల్పారామం పరిపాలన అధికారి కృష్ణ ప్రసాద్ పర్యవేక్షణలో నిర్వహించారు. దసరా సెలవులు కావడంతో పెద్ద ఎత్తున ప్రజలు శిల్పారామాన్ని సందర్శించారు.

# కార్పొరేషన్‌లో కమీషన్ల దందా

(మొదటి పేజీ తరువాయి)

పనులు, వీధిలైట్లు పనులు చేపట్టాల్సి ఉంది. అయితే టెండర్లు పూర్తయినా పనులు మాత్రం ప్రారంభం కాలేదు. దీనికి కార్పొరేషన్ అధికారుల నిర్లక్ష్యమేననే మొదటి నుంచి ఆరోపణలు బలంగా వినిపిస్తున్నాయి. అయితే ఇటీవల 15వ ఆర్థిక సంఘం నిధులు ఖర్చు చేసి వివరాలు పంపితేనే తిరిగి నిధులు విడుదల చేస్తామని ప్రభుత్వం చెప్పడంతో పనులపై గత మూడు మాసాల క్రితం కదలిక వచ్చింది. 15వ ఆర్థిక సంఘం నిధులకు సంబంధించిన పనులకు ఎమ్మెల్యే మాధవీరెడ్డి శంకుస్థాపన చేశారు. టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యులు ఆర్.శ్రీనివాసరెడ్డి(వాసు) సహకారంతో కార్పొరేషన్ కమీషనర్ మనోజ్‌రెడ్డిని వెంటపెట్టుకుని 2021-22 ఆర్థిక సంవత్సరం మొదలు 2022-23, 24 సంవత్సరానికి 15 ఫైనాన్స్ పనులకు సంబంధించి రూ.10.67 కోట్ల విలువైన 127 పనులకు ఎమ్మెల్యే ఒకే శిలాఫలకంతో శంకుస్థాపన చేశారు. ఇవే పనులకు వైసీపీ నేతలు, కార్పొరేటర్లు కూడా శంకుస్థాపనలు చేశారు. కార్పొరేషన్‌లో చోటుచేసుకున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో రూ.5లక్షల లోపు విలువైన కొన్ని కాంట్రాక్టు పనులను టీడీపీ కార్యకర్తలకు కట్టబెట్టారు. కూటమి ప్రభుత్వానికి మంచిపేరు వస్తుందన్న భావనతో పార్టీ నేతలు బలవంతంగా ఒత్తిడి చేసి పనులు చేయించారు. దీంతో తమ ప్రభుత్వమే అధికారంలో ఉంది.. బిల్లులు త్వరగా వస్తాయన్న ఆశతో చాలా మంది టీడీపీ కార్యకర్తలు కాంట్రాక్టు పనుల కోసం అప్పోసప్పో తెచ్చి పనులు పూర్తిచేసి ఒకే అనిపించుకున్నారు.

**కేశవా!..అంటూ మొక్కుతున్నా కాంట్రాక్టర్లు..**

అయితే, పనులు పూర్తి చేసిన కాంట్రాక్టర్లకు, తెలుగు తమ్ముళ్ళకు బిల్లుల చెల్లింపు ఆగిపోయింది. కార్పొరేషన్‌లోని ఇంజనీరింగ్ సెక్షన్‌లోని కొంత మంది అధికారులు, సిబ్బంది వ్యవహార తీరే ఇందుకు కారణమనే బలమైన అరోపణలున్నా యి. సాధారణంగా గతంలో రూ.40లక్షలపైన విలువ చేసే బిల్లులే ఎస్ఈ పరిశీలనకు వెళ్ళేవని తెలుస్తోంది. అయితే కార్పొరేషన్‌లో చోటుచేసుకున్న రాజకీయ ప్రేరేపిత పరిస్థితుల దృష్ట్యా కమీషనర్ మనోజ్‌రెడ్డి సూచనల మేరకు రూ.లక్ష విలువైన బిల్లులు కూడా ఎస్ఈ దృష్టికి తీసుకెళ్తున్నట్లు సమాచారం. దీంతో బిల్లుల చెల్లింపులో తీవ్ర జాప్యం జరుగుతోంది. కొంత మంది సిబ్బంది అవినీతి దుకాణాన్ని తెరిచారు. బిల్లు విలువను బట్టి కమీషన్ వసూలు చేస్తున్నారు. తాము అడిగినంత ముట్టచెబితేనే ఎం-బుక్‌ను పరిశీలిస్తున్నారు. లేకుంటే ఎం-బుక్‌కు దుమ్ముపట్టాల్సిందే. నిధులు లేవని పక్కనపెట్టేస్తున్నారు. బహిరంగంగానే సాగుతున్న ఈ వసూళ్ళపై తెలుగుతమ్ముళ్ళు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కేశవా.. ఏమిటీ ఈ అవినీతి అంటూ చెతులెత్తి మొక్కుతున్నారు. పనులు పూర్తి చేసేందుకే తాము అప్పులు చేయాల్సి వచ్చిం దని, తీరా బిల్లు చేతికి అందుతుందని ఎదురు చూస్తుంటే కమీషన్ల పేరుతో సిబ్బంది పీక్కుతింటున్నారని వాపోతున్నారు. తమ శక్తిమేరకు కొంత మొత్తం ముట్టచెప్పినా సిబ్బంది వినడం లేదని ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారంపై ఉన్నతాధికారులు స్పందించాలని కోరుతున్నారు. లేకుంటే నేరుగా మంగళగిరి టీడీపీ పార్టీ ఆఫీసుకు వెళ్ళి పరిస్థితిని మంత్రి లోకేష్‌కు వివరిస్తామని స్పష్టం చేస్తున్నారు.

# ఇప్పపెంట భూమిపై వివాదం

(మొదటి పేజీ తరువాయి)

0.75 ఎకరాల చొప్పున భూములు అప్పట్లో కేటాయించబడ్డాయి.అయితే, అప్పటి నుండి ఈ భూముల సబ్ డివిజన్ చేయకుండా అధికారులు విస్మరించడం వల్ల, లబ్దిదారులు తమకు కేటాయించిన భూమిని స్వాధీనం చేసుకోలేకపోయారు. దళిత రైతులు అడపాదడపా భూమిలో వ్యవసాయం చేస్తూ వచ్చినా, అధికారికంగా హద్దులు లేకపోవడంతో వారు తమ హక్కులను అమలు చేసుకోలేకపోయారు. చాలా సార్లు అధికారులను ఆశ్రయించినా సరైన స్పందన రాలేదని బాధితులు వాపోతున్నారు.ఇటీవల దలితులు తాము అనుకున్న భూమిలో ఓ వ్యక్తి అక్రమంగా హద్దులు వేస్తుండటాన్ని గమనించి అధికారుల వద్దకు వెళ్లారు. కానీ స్పందన లభించకపోవడంతో, వారే స్వయంగా భూమిలోకి వెళ్లిన సమయంలో, తాము భూమిని కొనుగోలు చేశామంటూ కొంతమంది అనుమానాస్పద వ్యక్తులు హద్దులు వేసి అడ్డుకున్నారని, రౌడీ మూకల ద్వారా బెదిరింపులు ఎదురయ్యాయని బాధితులు తెలిపారు.దీనిపై గ్రామస్థాయిలో అధికారులను ఆశ్రయించగా, వారు తిరుగుబాటు చేస్తున్న రైతులపై మానసిక ఒత్తిడి తేవడంతో పాటు, వాట్సాప్ ద్వారా చేసిన ఫిర్యాదులు తిరిగి అదే అధికారుల వద్దకు వెళ్లినట్లు తెలుస్తోంది. ఫిర్యాదు చేసిన బాధితులపై భూసంబంధిత హక్కులను రద్దు చేస్తానని నువ్వు బ్రతికి ఉన్నావనే పత్రం కూడా నేను ఇస్తేనే నువ్వు బ్రతికి ఉన్నట్టు అని బెదిరింపులకు దిగినట్టు బాధితుడు ఆరోపిస్తున్నాడు.ఈ అంశాన్ని సీరియస్‌గా తీసుకున్న యం.ఆర్.పి.యస్. మరియు రెవల్యూషనరీ పార్టీ నాయకులు, దలితుల పక్షంలో నిలబడి, న్యాయం జరగేదాకా పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. అధికారుల వేధింపులను ఖండిస్తూ, సర్వే నం. 274లోని 28 ఎకరాలకు సంబంధించి హద్దులు చూపించాలని మండల స్థాయి అధికారిని సంప్రదించగా ప్రస్తుతానికి మొత్తం 28 ఎకరాలకు హద్దులు చూపించినప్పటికి ఇందులో ఎవరికీ ఎలాంటి హక్కులు ఉన్నాయి అనే విషయం కావాలంటే కొంత సమయం కావాలని అధికారులు చెప్తున్నారని నిజంగానే అధికారులు మాకు న్యాయం చేస్తారా?పూర్తి సబ్ డివిజన్ ఎప్పుడవుతుందన్న అనిశ్చితి రైతులను కలవరపెడుతోంది.

**న్యాయం జరగకపోతే పోరాటం చేస్తాం**

ఇప్పపెంట గ్రామం లో ఆక్రమించిన భూమిని తిరిగి బాధితులకు ఇవ్వాలని వారికి ప్రభుత్వం కల్పించిన భూ హక్కులు ఇవ్వాలని అలా కాకుండా న్యాయం జరగకపోతే, త్వరలోనే దలితుల భూములపై ఉధృతమైన కార్యాచరణ ప్రకటించనున్నట్లు యం.ఆర్.పి.యస్. నేతలు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో యం.ఆర్.పి.యస్. రాష్ట్ర అధికార ప్రతినిధి ఎదురూరు బాబు, జిల్లా అధ్యక్షుడు కొట్టం సుబ్బారావు, రెవల్యూషనరీ పార్టీ నాయకులు కొడపకంటి నాగరాజు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

## యూరినేయం బాధితులకు అండగా ఉంటా

### యూరినేయం నిర్వాసితులకు అన్ని విధాలా న్యాయం జరిగేలా చూస్తా: టిడిపి ఇంచార్జ్ బీటెక్ రవి




పులివెందుల, మేజర్‌న్యూస్ : యురేనియం సంస్థ కల్లబొల్లి మాటలు చెప్పడం మానుకోవాలి అని, ప్రజలకు అన్యాయం జరిగితే నవించబోమని పులివెందుల నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ మారెడ్డి రవీంద్రనాథ్ రెడ్డి బీటెక్ రవి హెచ్చరించారు. మంగళవారం బీటెక్ రవి తెలుగుదేశం నాయకులు, యురేనియం బాధితులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను ఆర్డిఓ చిన్నయ్యకు తెలియజేశారు. అనంతరం బీటెక్ రవి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ యురేనియం సంస్థ రెండో టైయిల్ పాండింగ్ కోసం భూములు తీసుకుంటాం అని చెప్పి తీసుకోకుండా ఉన్న టైయిల్ పాండ్ ఎత్తు పెంచుకుంటూ పబ్బం గడుపుతున్నారన్నారు. గతంలో ఏ విధంగా నోటిఫికేషన్ ఇచ్చి భూములు తీసుకున్నారో అదే విధంగా తీసుకోవాలన్నారు .గతంలో భూములు కోల్పోయిన వారికి ఉద్యోగాలు ఇవ్వకుండా ఆలస్యం చేయడం తగదన్నారు. యురేనియం ప్రాంత ప్రజలకు న్యాయం చేయకుండా టైయిల్ పాండ్ పనులు మొదలు పెడితే తాము దగ్గర ఉండి అడ్డుకుంటామన్నారు. ప్రజలకు న్యాయం చేసిన తర్వాతనే పనులు మొదలు పెట్టాలన్నారు.ప్రజలు ఆరోగ్యపరంగా చాలా ఇబ్బందులు పడుతున్నారని, ప్రజలకు న్యాయం జరిగేలా అన్ని విధాలా అండగా ఉంటామని ఆయన తెలిపారు. తర్వలోనే డిప్యూటీ సిఎం పవన్ కళ్యాణ్ యూరినేయం ప్రాంతంలో పర్యటించి ఇక్కడి స్థితిగతులను ప్రజలనే అడిగి తెలుసుకుంటాడని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో వేముల తెలుగుదేశం పార్టీ నాయకులు శ్రీనాథ్ రెడ్డి, యురేనియం బాధితులు తదితర తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## ఎక్స్‌రే మిషన్ ప్రారంభించిన ఎమ్మెల్యే పుట్టా



**మైదుకూరు మేజర్ న్యూస్:** మైదుకూరు ప్రభుత్వ ఆసుపత్రి నందు ప్రజల సౌకర్యం కోసం ఏర్పాటు చేసిన కొత్త ఎక్స్ రే మిషన్ ను మంగళవారం మైదుకూరు ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్ ప్రారంభించారు. అనంతరం ఆసుపత్రి పరిసరాలను పరిశీలించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ ఆసుపత్రి చిన్నదైనా దానికి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ యాపరాల చిన్నను నియమించడం జరిగిందని. ఆస్పత్రికి చిన్న అభివృద్ధి కమిటీ డైరెక్టర్ అయినప్పటి నుంచి అహర్నిశలు శ్రమించి ఆసుపత్రిలో మౌలిక సదుపాయాలు కల్పించడంలో సఫలమయ్యారని. చిన్న తన సొంత నిధులు వెచ్చించి ఆసుపత్రికి వచ్చే రోగులు కూర్చునేందుకు వీలుగా ఆరు సిమెంటు బెంచీలు వేయించడం జరిగిందని. అంతేకాకుండా పత్తి సుబ్బారావు సహకారంతో నాలుగు ఐరన్ కుర్చీలను కూడా ఆసుపత్రిలో వేయించడం జరిగిందని వారిని పొగిడారు. త్వరలో ఆసుపత్రికి కావలసిన డయాలసిస్ సెంటర్, పోస్టుమార్టం, అవుట్ పోస్ట్ మంజూరు కానున్నాయని తెలిపారు. అలాగే డిఎంఎఫ్ పండు కింద ఆర్వో ప్లాంట్, జనరేటర్, ఆక్సిజన్ సెంటర్ దళిత మౌలిక వసతులు కూడా కల్పించడం జరుగుతుందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ యాపరాల చిన్న, పార్టీ పట్టణ అధ్యక్షుడు దాసరిబాబు ,మార్కెట్ కమిటీ చైర్మన్ ఏ.పీ రవీంద్ర, ధనపాల జగన్, ద్వార్సల గురివిరెడ్డి, మునిశేఖర్నా రెడ్డి, పల్లవోలు సుధాకర్ రెడ్డి, కాలువ గురప్ప, కోన సుబ్బారావు, బండి అమర్నాథ్, తుపాకులరమణ, డాక్టర్ల జోష్నారెడ్డి,కరీముల్లాలు పాల్గొన్నారు.

## నూతన విగ్రహ ప్రతిష్టను జయప్రదం చేయండి

### పులివీడు గ్రామ పెద్దలు మరియు ప్రజలు



**పోరుమామిళ్ల, మేజర్‌న్యూస్:** పోరుమామిళ్ల మండలం, పులివీడు గ్రామం నందు నూతనంగా నిర్మించిన శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయం నందు అక్టోబర్ 3 వ తేదీ శుక్రవారం నుండి 5 వ ఆదివారం వరకు శ్రీ మద్గణపతి నందీశ్వర ధ్వజ శికర కలశ నూతన విగ్రహ ప్రతిష్ట కుంబాభిషేక మహోత్స వ కార్యక్రమాలు జరుగును గ్రామ పెద్దలు నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో భాగంగా శుక్రవారం ఉదయం నుండి ఆదివారం సాయంత్రం వరకు వివిధ రకాల పూజా కార్యక్రమాలు, అన్నదానము, విగ్రహ ప్రతిష్ట జరుగును. ఈ సందర్భంగా ప్రజలందరూ ఈ కార్యక్రమానికి విచ్చేసి భగవంతుని ఆశీర్వాదాన్ని పొందగలరని గ్రామ పెద్దలు మరియు గ్రామ ప్రజలు కోరారు.

## గజలక్ష్మి దేవి అలంకారంలో చౌడేశ్వరి అమ్మవారు



**సింహాద్రిపురం, మేజర్‌న్యూస్ :** పులివెందుల నియోజకవర్గం సింహాద్రిపురం బైపాస్ రోడ్డు నందు కొత్త చౌడేశ్వరి దేవి ఆలయంలోమంగళవారంఆశ్వీయుజ శుద్ధ అష్టమి రోజు చౌడేశ్వరి దేవి శ్రీగజ లక్ష్మీ దేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు. ఉదయాస్తమానం అమ్మవారికి పంచా మృతాభిషేకం సహస్రనామార్చన కుంకుమార్చన తదితర పూజ కైకర్యాల అనంతరం అమ్మవారు ప్రత్యేక అలంకారంలో భక్తులకుదర్శనమిచ్చారు. ఈ పూజ కార్యక్రమాలు అర్చకులు ఆ విధానం సుబ్రమణ్యం ఆధ్వర్యంలో నిర్వహించారు. వాటిలో భాగంగా అనంతరం చౌడేశ్వరి అమ్మవారికి వడి బియ్యం సమర్పించారు. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని తీర్థ ప్రసాదంలు స్వీకరించారు.

## నవ వధువు ఆత్మహత్య

### భర్త వివాహేతర సంబంధం..? భార్య ప్రాణం తీసింది



**పులివెందుల, మేజర్‌న్యూస్:** భర్త మరో యువతితో వివాహ సంబంధం పెట్టుకున్నాడని తెలిసి ఒక నవ వధువు నవ్య శ్రీ (19) ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన పులివెందులలో చోటుచేసుకుంది. స్థానికుల కథనం మేరకు పులివెందుల పట్టణం జయమ్మ కాలనీకి చెందిన కమలనాథ్ కు లింగాల మండలం పార్నపల్లెకు చెందిన నవ్య శ్రీ అనే యువతీతో గత నెలలో వివాహమైంది. కమల్ నాథ్ గతంలో హైదరాబాదులో ప్రైవేట్ కంపెనీలో ఉద్యోగం చేసి మానేసి పులివెందులకు వచ్చినట్లు సమాచారం .అయితే తన జీవిత భాగస్వామి కమల్నాథ్ వేరే మహిళతో అక్రమ సంబంధం పెట్టుకొని తనను మోసం చేశాడని బాధతో నవ్య శ్రీ తెల్లవారుజామున తన ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ విషయం గమనించిన కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తీసుకెళ్లడంతో నవ్య శ్రీ ని పర్శిక్షించిన వైద్యులు మృతి చెందినట్లు తెలిపారు. నవ్య శ్రీ తండ్రి నరసింహులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని నిజనిజాలు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

## సింహవాహనం మీద మహిషాసురుడిని సంహరిస్తున్న రూపంలో అమ్మవారు




**పులివెందుల, మేజర్‌న్యూస్ :** పులివెందుల పట్టణంలోని అంకాలమ్మ దేవస్థానము నందు దేవీ నవరాత్రి ఉత్సవాలు వైభవంగా నిర్వహిస్తుండగా మంగళవారం 9వ రోజు సింహ వాహనం మీద ఒక చేత త్రిశూలం ధరించి మహిషాసురుడిని సంహరిస్తున్న రూపంలో అంకాలమ్మ తల్లి అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. ఆశ్వీయుజ నవమి 9వ రోజు ఉదయాస్తమాన అంకాలమ్మ తల్లికి విశేష పూజల అనంతరం మహిషాసుర మర్దిని దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా ఆలయ చైర్మన్ బ్యాటరీ ప్రసాద్ మాట్లాడుతూ దేవి శరన్నవరాత్రులు 9వ రోజు అంకాలమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహించి సాయంకాలం మహిషాసుర మర్దిని దేవి అలంకారంలో అంకాలమ్మ దర్శనమివ్వగా పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని అమ్మవారి దీవెనలు పొందడం జరిగిందన్నారు. ఈ సందర్భంగా హాజరైనటువంటి భక్తజనానికి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు ఎండోమెంట్ నిర్వాహకులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## శ్రీ వాసవి కన్యక పరమేశ్వరి అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్సీ గోవింద రెడ్డి



**బ్రహ్మంగారిమఠం, మేజర్‌న్యూస్:** బ్రహ్మంగారి మఠంలోని అమ్మవారిశాలలో దసరా ఉత్సవాలలో భాగంగా నూతన అమ్మవారి శాల చైర్మన్ అయ్యపు వెంకట సురేష్ బాబు ఆహ్వానం మేరకు అమ్మవారి శాలలో జరుగుతున్న పూజా కార్యక్రమంలో పాల్గొని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారిని దర్శించుకున్న ఎమ్మెల్సీ డి.సి. గోవింద రెడ్డి, ఆయనకు పూర్ణకుంభమతో పండితుల మధ్యలో స్వాగతం పలికిన అమ్మవారిశాల అధ్యక్షుడు అయ్యపు వెంకట సురేష్ బాబు, అనంతరం ఘనంగా శాలువాలతో సన్మానించి తీర్థ ప్రసాదలను అందజేశారు. అలాగే బద్వేలు నియోజకవర్గ బూత్ కన్వీనర్లు సమన్వయకర్త వైఎస్ఆర్సిపి నాయకులు కల్లూరి రమణారెడ్డి, వైఎస్ఆర్సిపి నాయకులు బి.కోడూరు బలరామిరెడ్డి, ఆమగంపల్లి ప్రభాకర్ రెడ్డి, బద్దెల శ్యాంసుందర్ రెడ్డి, నరసింహారెడ్డిలను ఘనంగా సన్మానించారు.ఈ కార్యక్రమంలో కార్యదర్శి సుంకు సురేష్ బాబు, కోశాధికారి వెంకటేశ్వర్లు, ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు యాద్దళ్ళ వెంకటసుబ్బయ్య, మాజీ అధ్యక్షుడు కృష్ణమూర్తి, మాజీ కార్యదర్శి ముచ్చర్ల శేషయ్య, పబ్బతి నాగేశ్వరరావు, డాక్టర్ సురేంద్ర,మాకం సుధాకర్, సుంకు శేషాద్రి ,తదితరులు ఉన్నారు. 12 వార్డు మెంబర్ తిప్పన నాగార్జున నాయుడు, జిల్లా విద్యార్థి విభాగం ఉపాధ్యక్షుడు సాయి నారాయణ రెడ్డి, మహేష్ ఉన్నారు.

## జిల్లా బిజేపి కార్యదర్శిగా కొర్రపాటి కంబగిరి నియామకం



**ప్రొద్దుటూరు, మేజర్‌న్యూస్:** జిల్లా బిజెపి కార్యదర్శి గా మండలంలోని తాళ్లమాపురం గ్రామానికి చెందిన కొర్రపాటి కంబగిరిని నియమిస్తూ జిల్లా అధ్యక్షులు జంగిటి వెంకట సుబ్బారెడ్డి నియామక పత్రం జారీ చేశారు. ఈ మేరకు కంబగిరికి మంగళవారం రాష్ట్ర మహిళా మోర్చా అధ్యక్షురాలు సి.వి. జయలక్ష్మి నియామక పత్రం అందించారు. ఈ సందర్భంగా కంబగిరి తనపై నమ్మకంతో ఈ పదవి అందించిన జిల్లా అధ్యక్షుడు జంగిటి వెంకటసుబ్బారెడ్డి, నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన ఈ బాధ్యతకు 100 శాతం న్యాయం చేస్తానని తెలిపారు.

## సకాలంలో పంట రుణాలను రెన్యువల్ చేసుకోవాలి

### 625 మందికి 20 కోట్లు స్వల్ప దీర్ఘకాలిక రుణాలు
### వ్యవసాయ సహకార పరపతి సంఘం అధ్యక్షులు మల్లు గోపాల్ రెడ్డి




**ఎర్రగుంట్ల మేజర్‌న్యూస్:** ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘంలో రుణాలు తీసుకున్న రైతులు వడ్డీలు చెల్లించి రెన్యువల్ చేసుకోవాలని సున్నపురాళ్లపల్లె ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం అధ్యక్షులు మల్లు గోపాల్ రెడ్డి అన్నారు. మంగళవారం సహకార సొసైటీ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతు సహకార సంఘం ద్వారా 625 మందికి రూ.20 కోట్లు అందజేసినట్లు తెలిపారు. రుణాలు తీసుకున్న రైతులందరూ సకాలంలో వడ్డీలు చెల్లించి రెన్యువల్ చేసుకోవాలని ఆయన సూచించారు.త్వరలో కొత్త రుణాలను మంజూరు కానున్నట్లు తెలిపారు. సొసైటీ అభివృద్ధికి తమ వంతు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సొసైటీ డైరెక్టర్లలతో పాటు తదితరులు పాల్గొన్నారు.

## సమస్త భయాలను పోగొట్టే మహిషాసుర మర్ధినిగా అమ్మవారు



**పులివెందుల, మేజర్‌న్యూస్ :** దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో తొమ్మిదో రోజు ఆశ్వీయుజ శుద్ధ నవమి రోజున మహిషాసుర మర్ధిని దేవి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఎనిమిదవ రోజు సాయంకాల సమయాన మహిషాసురమర్ధిని దేవి అలంకారంలో వాసవి అమ్మవారు భక్తులకు దర్శన భాగ్యాన్ని కల్పించగా, అలంకరణను ఆస్వాదిస్తూ భక్తజనం పులకరించి తన్మయత్నం పొందారు. అష్టభుజాలతో దుష్టుడైన మహిషాసురుడిని అమ్మవారు సంభవించింది ఈ రూపంలో నేనని, సింహ వాహనాన్ని అదృష్టంచి ఆయుధాలను ధరించిన మహాస్మృతిగా భక్తులను సాక్షాత్కరించింది మహిషాసుర మర్ధిని దేవి అలంకారంలోనినని తలచినంతనే సమస్తభయాలను పోగొట్టి ధైర్యాన్ని ధైర్యాన్ని ప్రసాదించేది మహిషాసుర మర్ధిని దేవిగా అభివందించారు. ఈ సందర్భంగా హాజరైనటువంటి భక్తజనానికి ఆర్యవైశ్య సంఘం మహిళా సంఘం మరియు అనుబంధ సంఘాల కమిటీ ఆధ్వర్యంలో తీర్థ ప్రసాదాలను వినియోగించి భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా తగు జాగ్రత్తలు పాటించారు.

## డిజిటల్ బుక్ యాప్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న వైసీపీ నాయకులు



**కలసపాడు, మేజర్‌న్యూస్:** ఎమ్మెల్సీ డీసీ గోవిందరెడ్డి , ఎమ్మెల్యే డాక్టర్ సుధ ఆదేశాల మేరకు బద్వేల్ నియోజకవర్గం కలసపాడు మండలంలో డిజిటల్ బుక్ యాప్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించబడింది.కూటమి కుట్రదారులు చేస్తున్న అబద్ధ ప్రచారం, అరాచకాలను తిప్పికొట్టాలని సంకల్పంతో మన వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్మోహన్ రెడ్డి డిజిటల్ బుక్ యాప్‌ను లాంచ్ చేసి, కార్యకర్తలకు దాని ప్రాముఖ్యతను వివరించారు.ఈ కార్యక్రమంలో మండల వైసీపీ నాయకులు గురివిరెడ్డి, నారాయణ, రాంబాబు నారాయణరెడ్డి మండల అధ్యక్షులు సగిలి సుదర్శన్, పురుషోత్తం రెడ్డి, నియోజకవర్గ బూత్ అధ్యక్షులు మండల ఉపాధ్యక్షులు అన్నారెడ్డి విజయ భాస్కరరెడ్డి, డిస్ట్రిక్ట్ ఎగ్జిక్యూటివ్ సెక్రటరీ చిత్త రాజశేఖర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, విష్ణు, అనిల్, సింగరయ్య, పగిడి థామోస్, సురేష్, తెల్లపాడు వైసిపి నాయకులు జయన్న, ఎనుముల శ్రీనివాసులరెడ్డి, మస్తాన్, వెంగళరెడ్డి, కలసపాడు భాషా కో-ఆప్షన్ మెంబర్ భాషా, ఓబుల్రెడ్డి తెల్లపాడు వైసిపి నాయకుడు తప్పెట, నాగయ్య, బాలకృష్ణ, వైఎస్సార్సీపీ సోషల్ మీడియా ఎగ్జిక్యూటివ్ మెంబర్ బద్రినాథ్ తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ గవర్నర్‌చే పిహెచ్డీ పట్టా




**వేంపల్లె, మేజర్‌న్యూస్:** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పనిచేస్తున్న చరిత్ర అధ్యాపకుడు డా.బాలకొండ గంగాధర్ కు తెలంగాణ రాష్ట్ర గవర్నర్ విష్ణుదేవ్ వర్మ చే పిహెచ్డీ పెట్టాను అందజేశారు. డా.సర్వేపల్లి రాధాకృష్ణన్, వరాహగిరి వెంకటగిరి, నీలం సంజీవరెడ్డి లపై విమర్శ నాత్మక విశ్లేషణ అంశాలపై ప్రొఫెసర్ సుధారాణి పర్యవేక్షణలో ఆయన పిహెచ్డీ పూర్తి చేశారు. గడిచిన 30 ఏళ్లు ఆయన కడప సుబ్బిరెడ్డి డిగ్రీ కళాశాల, ప్రభుత్వ మహిళా కళాశాల, స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో చరిత్ర అధ్యాపకునిగా విశిష్టమైన సేవలందించారు. డా.బాలకొండ గంగాధర్ ఇప్పటి వరకు 10కీ పైగా గ్రంధాలు, 40 పరిశోధన పత్రాలు దేశీయ, అంతర్జాతీయ సదస్సులో సమర్పించారు. 2014లో ఉత్తమ టీచర్ అవార్డు, 2015లో గ్లోబల్ రోల్ మోడల్ అవార్డు, అలాగే ఏపి హయ్యర్ ఎడ్యుకేషన్ ఎక్సలెన్స్ అవార్డు, 2024లో ఏపి టూరిజం ఎక్సలెన్స్ ఇన్ రైటింగ్ అవార్డు లను అందుకున్నారు. వీరికి చరిత్ర శాఖలో డాక్టర్ పట్టా రావడం పట్ల అధ్యాపకులు, మిత్రబృందం, ప్రముఖులు, సామాజిక వేత్తలు అభినందం తెలియజేశారు.

# ఈశ్వరీ దేవి ఆశ్రమమునందు జగన్మాత శ్రీ దుర్గా దేవి అవతారంలో భక్తులకు దర్శనం





**బద్వేల్ మేజర్‌న్యూస్ :** బద్వేలు మున్సిపాలిటీ పరిధిలోని మైదుకూరు రోడ్డు నందు గల జగన్మాత శ్రీ ఈశ్వరీ దేవి ఆశ్రమమునందు మంగళవారం జగన్మాత శ్రీ దుర్గా దేవి అవతారంలో భక్తులకు దర్శనమిచ్చినది .ఆశ్రమ పీఠాధిపతులు శ్రీ సుబ్బరాయుడు స్వాముల వారి ఆధ్వర్యంలో ఉదయం నుండే గణపతి పూజ. కుంకుమార్చన నవగ్రహ పూజ. నవగ్రహ శాంతి హోమము దుర్గాదేవికి ఇష్టమైనటువంటి పూజ హోమ కైంకర్యములు జరిగినవి . భక్తులు ఉదయము నుండే అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారిని సేవించి తీర్థ ప్రసాదములు తీసుకొనుట జరిగినది . ఈ రోజు ప్రత్యేకఉభయ దాతలుగాభూపాలం నాగరాజా వీరి సతీమణి విజయలక్ష్మి కుమారులు రాఘవేంద్రరావు విష్ణువర్ధన్. పత్తి వెంకట నాగేంద్ర ప్రసాద్ అడ్వకేట్ వీరి సతీమణి హేమలత కుమారులు సాకేత్ శ్రీరామ్ అనిరుద్ . పబ్బతి సురేంద్రబాబు వీరి సతీమణి నాగరత్న కుమారుడు యశ్వంత్ . ముచ్చర్ల సుధాకర్ వీరి సతీమణిసుజాత కుమారుడు ప్రవీణ్ సింగంశెట్టి రాధమ్మ గారు వీరి కుమారుడు వెంకటసుబ్బయ్య వీరి సతీమణిసుప్రజా కుమారుడు మనోజ్ తేజ్ విద్యశ్రీ దన్విక్ తేజ్. మునగాల వేణుగోపాల్ ఆచారి వీరి సతీమణి అరుణ కుమారుడు నాగ రాఘవాచారి గారు. ఇక్కడ జరిగినటువంటి పూజా కైంకర్యములలో ప్రత్యేక ఉభయ దాతలుగా ఉన్నారు భక్తులందరికీ మధ్యాహ్నం ప్రసాద వితరణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసిరి.. ఇక్కడ జరిగే అన్ని కార్యక్రమాలలో భక్తులకు సౌకర్యం కలగకుండా ఏర్పాట్లను కార్యకర్తలైనటువంటి. కమ్మర వెంకట రాజేష్ చిన్న బ్రహ్మయ్య చారి సివి నాగేశ్వరరావు ఇతర కమిటీ సభ్యులతో పాటు మహిళా మండలి సభ్యులు పాల్గొని రి. ప్రతిరోజు సాయంత్రం అమ్మవారికి పారాయణ కార్యక్రమము కుంకుమార్చన పూజలతో పాటు భక్తులకు తీర్థ ప్రసాదములు ఇచ్చి అనంతరము వారికి అల్పాహారమును ఏర్పాటు చేసిరి

# దుర్గాదేవి అలంకరణలో మాలే గంగమ్మ తల్లి



**పులివెందుల మేజర్‌న్యూస్ :** పులివెందుల మున్సిపాలిటీ పరిధిలోని బ్రాహ్మణ పల్లి గ్రామంలో మా లే గంగమ్మ దేవాలయంలో దసరా శరన్నవ రాత్రుల ఉత్సవాలు మంగళవారంఘనంగా గ్రామ ప్రజల ఆధ్వర్యంలో నిర్వహి ంచారు. తొమ్మిదవ రోజున అమ్మవారికి అభిషేకం ప్రత్యేక పూజలు, కుంకు మార్చన కార్యక్రమాన్ని నిర్వహించారు. అమ్మవారు దుర్గాదేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా అమ్మవారికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన తీర్థప్రసా దాలను వారు అందుకున్నారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం లాగే ఈ సంవత్సరం కూడా దసరా ఉత్సవాల్లో భాగంగా అమ్మవారు రోజు ఒక అవతారంలో ప్రజలకు దర్శనం ఇవ్వడం జరుగుతుందన్నారు.

# ముళ్ళ పొదలను చెత్తను తొలగిస్తున్న జె.సి.బి.



**పెండ్లిమర్రి మేజర్‌న్యూస్ :** పెండ్లి మర్రి మండలంలోని, మొయిళ్ళ కాల్వ పంచాయతీ, ఎస్ రామాపురం ఎస్టీ కాలనీకి వెళ్లే దారిలో విపరీతమైన ముళ్ళ చెట్లు, చెత్త పేరుకు పోవడంతో గ్రామస్తులు గత కొద్ది రోజులుగా చాలా ఇబ్బందులు పడుతుండటం చూసిన స్థానిక తెలుగుదేశం పార్టీ నాయకుడు సానాపల్లి నాగేశ్వర్ రెడ్డి తన సొంత ఖర్చులతో జె.సి.బి. సహాయంతో ముళ్ల పొదలని చెత్తను శుభ్రం చేయించడం జరిగింది..

# పద్మావతి వెంకటరమణునికి డాక్టర్ నవీన్ దంపతులు విశేష పూజలు



**పులివెందుల మేజర్‌న్యూస్ :** పులివెందుల పట్టణ పరిధిలో నడిబొడ్డున కొలువై ఉన్న శ్రీ పద్మావతి వెంకటరమణ స్వామి ఆలయంలో దేవి శరన్నవరాత్రులను పురస్కరించుకొని ఉదయ స్తమాన ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో వెంకటరమణునికి పంచామృతాభిషేకం, సహస్ర నామార్చన, తదితర పూజ కైంకర్యాల అనంతరం స్వామి వారు ప్రత్యేక అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ కార్యక్రమంలో భాగంగా మంగళవారం ఉభయదారులైనటువంటి డాక్టర్ నవీన్, డాక్టర్ శరణ్య దంపతులు దేవి శరన్నవరాత్రులను పురస్కరించుకుని పద్మావతి వెంకటరమణనికి విశేష పూజలు నిర్వహించేందుకు స్వామివారికి సమర్పించే గజమాల తలపై మోసుకుంటూ మేల వాయిద్యాలతో ఆలయ ప్రాంగణంలో సాంప్రదాయంగా భక్తిశ్రద్ధలతో ప్రదక్షణ నిర్వహించి వెంకటేశ్వర స్వామికి గజమాల సమర్పించి విశేష పూజలు నిర్వహించి స్వామివారి దీవెనలు అందుకున్నారు. అనంతరం శరణ్య దంపతులు మాట్లాడుతూ ఎంతో ప్రతిష్టాత్మకంగా భక్తి శ్రద్ధలతో దసరా ఉత్సవాలు జరుగుతున్న నేపథ్యంలో కలియుగ దైవం శ్రీ వెంకన్న స్వామికి పూజలు నిర్వహించాలన్న సంకల్పంతో మొక్కులు చెల్లించి పూజా కార్యక్రమాలు నిర్వహించడం జరుగుతుందని, ఆ వెంకటేశ్వర స్వామి దీవెన ప్రతి ఇంటిలో సుఖ సంతోషాలతో వర్థిల్లాలని, అందరూ బాగుండాలి అందులో మనము ఉండాలని కోరుకోవడం జరుగుతుందని డాక్టర్ శరణ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు , భక్తులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బార్

## బీటెక్ రవి



**పులివెందుల మేజర్‌న్యూస్ :** ప్రజా సమస్యల పరిష్కారానికే ప్రజా దర్బార్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నడం జరిగింది. మంగళవారం పులివెందుల టీడీపీ కార్యాలయంలో ప్రజా దర్బార్ కార్యక్రమంను నిర్వహించిన పులివెందుల టీడీపీ ఇంచార్జ్ బీటెక్ రవి . పలు సమస్యలతో వచ్చిన ప్రజల వద్ద నుండి అర్జీలు స్వీకరించి వారి యొక్క సమస్యలను సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించడం జరిగింది. ఈ సందర్భంగా బిటెక్ రవి మాట్లాడుతూ ప్రజా ప్రభుత్వంలో ప్రజల ఆకాంక్షలు నెరవేరుతున్నాయి. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీలు ఒక్కొక్కటిగా కూటమి ప్రభుత్వం నెరవేరుస్తుండడం హర్షించదగ్గ విషయం. గత ప్రభుత్వ నిర్లక్ష్యం కారణంగా నియోజకవర్గంలో ప్రజలు వివిధ సమస్యలతో ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారని ప్రజా, సమస్యలు పరిష్కరిం చేందుకు ప్రజాదర్బార్ కార్యక్రమం ద్వారా ప్రజల వద్దకే వెళ్లి వారి సమస్య లను తెలుసుకొని తక్షణమే పరిష్కారం చేసే దిశగా ఎన్డీయే ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ప్రజాదర్బార్ లో ప్రజలు ఇచ్చిన అర్జీలు పరిశీలించి వాటిని పరిష్కారం చేసి అర్జీదారులకు తెలపాలని అధికారులను ఆదేశించడం జరి గింది. కార్యక్రమంలో ప్రజలు టిడిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# ఎస్పిని కలిసిన బీటెక్ రవి



**పులివెందుల మేజర్‌న్యూస్ :** కడప జిల్లా నూతన ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన నచికేత్ విశ్వనాథ్ ని వారి కార్యాలయంలో మంగళవారం పులివెందుల టీడీపీ ఇంచార్జ్ బీటెక్ రవి , తుంగభద్ర ప్రోజెక్టు హైలెవెల్ కెనాల్ చైర్మన్ మారెడ్డి జోగిరెడ్డి లుమర్యాదపూర్వకంగా .కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా శాంతి భద్రతలు, చట్ట సువ్యవస్థ మరింత బలపడాలని కోరుతూ, ప్రజల భద్రతా పరిరక్షణలో ఎస్పీ గారు విజయవంతం కావాలన్న ఆకాంక్ష వ్యక్తం చేశారు.ప్రజల సంక్షేమం అభివృద్ధి శాంతి భద్రతల పరిరక్షణ పట్ల తమ సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు.

# నవరాత్రి బ్రహ్మోత్సవాల కార్యక్రమంలో భాగంగా రెండవ రోజు బింద సేవా కార్యక్రమం




**బద్వేల్ మేజర్‌న్యూస్ :** బద్వేల్ ఆర్యవైశ్య వర్తక సంఘం ఆధ్వర్యంలో దేవీ నవరాత్రుల సందర్భంగా రెండవ రోజు శ్రీ కన్యకా పరమేశ్వరి బిందె సేవా కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమాన్ని బిందు సేవా ఆర్గనైజర్ కొలపర్తి శివరామకృష్ణ ఆధ్వర్యంలో అమ్మవారి బిందెను ప్రత్యేకంగా అలంకరించి నవ గంగా నది జలాలను తెప్పించి శుద్ధి చేసిన అనంతరం పూజాది కార్యక్రమాల అనంతరం నవ నదుల ప్రత్యేకంగా తెప్పించిన గంగాజలాలను బిందెలో నింపిన అనంతరం మొట్టమొదటిగా బిందెసేవ కార్యక్రమం ఆర్గనైజర్ కులపర్తి శివరామకృష్ణ తన సిరియోదాయంపై శిరోదార్యంపై అలంకరించిన వెండి కలశంబిందెను అలంకరించుకొని పురవీధుల గుండా మంగళ వాయిద్యాలు నడుమ వాసవి మాత నామస్మరణతో ముందుకు సాగారు. ఆర్యవైశ్య మహిళలు అమ్మవారి బిందెసేవకు పసుపునీళ్లతో వారు పోసి అమ్మవారిని తమ గృహము ముందుకు ఆహ్వానించి అనంతరం కర్పూరంతో హారతులు ఇచ్చి కొబ్బరికాయను అర్పించి పూజలు నిర్వహించారు. అమ్మవారి బిందె సేవా కార్యక్రమాన్ని నాలుగు ప్రధాన రోడ్లలో హద్దులు వరకు అమ్మవారు బిందె సేవ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో అమ్మవారి సేవలో పాల్గొనేందుకు యువకులు సూర్యోదయపురం నుంచి భక్తిశ్రద్ధలతో అమ్మవారి నిష్కరించు కుంటూ ఉపవాసాలతో నగరమంతా విందు సేవ కార్యక్రమాన్ని నిర్వహించిన అనంతరం అమ్మవారి సన్నిధిలో చేరుకొని ఆలయ ప్రాంగణంలోని గర్భగుడి చెట్టు మూడు సార్లు ప్రదర్శన చేసిన అనంతరం అమ్మవారికి బింద సేవలో పాల్గొన్న యువకులచే హారతి ఇచ్చి అమ్మవారికి సమర్పిస్తారు. అనంతరం కార్యక్రమంలో పాల్గొన్న ఆర్యవైశ్య యువకులకుఆర్యవైశ్య వర్తక సంగం ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి వారికి తీర్థప్రసాదాలు అంద జేస్తారు. ఈ కార్యక్రమంన్నీ ఆర్యవైశ్య వర్తక సంఘం కమిటీ సభ్యులు శ్రీరామ్ వెంకటసుబ్బయ్య మాకం సుధాకర్ సముద్రాల లక్ష్మీనరసింహారావు మరియాల జగదీష్ గోనగుంట్ల చంద్రమోహన్ వారి ఆధ్వర్యంలోఎలాంటి ఇబ్బందులు జరగకుండా పర్యవేక్షిస్తూ అమ్మవారి బింద సేవా కార్యక్రమాన్ని పూర్తి చేశారు.

# ఎమ్మెల్సీ నూతన ఎస్పీ నచికేత్ విశ్వనాథ్‌తో భేటీ

## స్థానిక సమస్యలపై చర్చ



**పులివెందుల మేజర్‌న్యూస్ :** శాసనమండలి సభ్యులు భూమిరెడ్డి రామ గోపాల్ రెడ్డి మంగళవారం నూతనంగా బాధ్యతలు చేపట్టిన జిల్లా సూపరిం టెండెంట్ ఆఫ్ పోలీస్ నచికేత్ విశ్వనాథ్ ని జిల్లా ఎస్పీ కార్యాలయంలో మర్యాద పూర్వ కంగా కలిసి ఎస్పీగా బాధ్య తలు చేపట్టిన విశ్వనాథ్ కి ఎమ్మెల్సీ శుభాకాంక్షలు తెలియ జేసారు. అనంతరం, నియోజ కవర్గంలో ఉన్న ప్రధాన స్థానిక సమస్యలు, అసాంఘిక కార్యకలాపాలు వంటి అంశాలపై ఎస్పీ తో చర్చించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆర్.ఎం.పి, పిఎంపి చికిత్సల విధి విధానాలపై అధికారులతో చర్చిస్తాం

- శీతాకాల అసెంబ్లీ సమావేశాల్లో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తాం
- ఎమ్మెల్యే పుట్టా సుధాకర్ యాదవ్



**దువ్వూరు, మేజర్‌న్యూస్ :** ఆర్.ఎం.పి, పి.ఎం.పి చికిత్స విధి, విధానాలపై త్వరలో అధికారులతో చర్చిస్తామని ఎమ్మెల్యే సుధాకర్ యాదవ్ పేర్కొన్నారు. అలాగే శీతాకాల అసెంబ్లీ సమావేశాల్లో ఆర్ఎంపి,పి.ఎం.పి ప్రథమ చికిత్సల వ్యవస్థలపై రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి వాటిపై అన్ని విధాల చర్చిస్తామని పేర్కొన్నారు. మంగళవారం ప్రొద్దుటూరులోని ఎమ్మెల్యే సుధాకర్ యాదవ్ స్వగృహంలో దువ్వూరు మండలానికి చెందిన ఆర్ఎంపీలు ప్రతినిధులు ఎమ్మెల్యేని కలసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆర్ఎంపి పిఎంపి వ్యవస్థలపై పలు సమస్యలపై ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు .ఆర్ఎంపీ,పీఎంపీ వ్యవస్థలపై లిఖితపూర్వకంగా వినతి పత్రం అందించారు. ఆర్ఎంపి,పిఎంపి లు నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటున్నారన్నారు ప్రథమ చికిత్స కేంద్రాలపై ఒత్తిడి రాకుండా అధికారులు దృష్టికి ఆయన తీసుకెళ్లారు. ఆర్ఎంపిలు గా విధులు నిర్వహిస్తున్న ప్రతినిధులకు ప్రభుత్వం నుంచి గుర్తింపును అందివ్వాలని కోరారు. వీలైతే ప్రభుత్వం ద్వారా వారికి శిక్షణను కూడా అందించి గుర్తింపు పత్రాలను అందించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో దువ్వూరు పట్టణ టిడిపి అధ్యక్షులు పాపినేని రాంబాబు,ఆర్.ఎం.పి ప్రథమ చికిత్సల మండల మండల అధ్యక్షుడు అమీర్ భాష ఉపాధ్యక్షులు ఎల్. తాహిర్ హుస్సేన్, కార్యదర్శి జయకృష్ణ, కోశాధికారి దస్తగిరి, సహాయ కార్యదర్శి కే. నర సింహులు, ఆర్ఎంపీ వైద్యులు షబ్బీర్ భాష, శ్రీనివాసులు, శివప్రసాద్, పాల్గొన్నారు.

# జిల్లా ఎస్పీని కలిసిన బోనం సిలాస్




**కడప టౌన్, మేజర్‌న్యూస్ :** జిల్లా నూతన ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన నచికేత్ విశ్వనాథ్ షెల్కె ను వారి కార్యాలయంలో మంగళ వారం ఆర్టీఐ జిల్లా ప్రధాన కార్యదర్శి, టీడీపీ నగర ఆర్గనైజింగ్ సెక్రటరీ బోనం శిలాస్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఎస్పీ కి పూలకుండి అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా సిలాస్ మాట్లాడుతూ జిల్లాలో శాంతి భద్రతలు, అదుపు చేసే విషయంలో పారదర్శకత పాటించాలని ఎస్పీ కి విన్నవిం చామన్నారు.సగటు సామాన్యునికి తక్షణ న్యాయం జరిగేటట్టు జిల్లా స్థాయి లో అన్ని పోలీస్ స్టేషన్ లలో చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని కోరారు.ప్రజల భద్రతా పరిరక్షణలో ఎస్పీ విజయవంతం అవుతారని ఆకాంక్ష వ్యక్తం చేశారు.ప్రజల సంక్షేమం, అభివృద్ధి, శాంతి భద్రతల పరిరక్షణ పట్ల తమరి సహకారం ఎల్ల ప్పుడూ ఉండాలని ఆకాంక్షించారు.

# వివేకానంద ఫౌండేషన్ ఆధ్వర్యంలో మహిళలకు దుస్తులు పంపిణీ




**పోరుమామిళ్ళ మేజర్‌న్యూస్ :** పోరుమామిళ్ల మండల పరిధిలోని రామా యపల్లె యానాది కాలనీలో ఉన్న 40 మంది మహిళలకు దసరా పండగ పురస్కరించుకొని మంగళవారం వివేకానంద ఫౌండేషన్ సంస్థ ఆధ్వ ర్యంలో దుస్తులను పంపిణీ చేశారు.సందర్భంగా ఆ సంస్థ వ్యవస్థా పకులు పాపిజెన్ని రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ గత కొన్నేళ్లుగా కాలనీ వాసులకు దాతల సహకారంతో వీరికి అవసరమైన నిత్యావసరాలు, దుస్తులు,చెప్పులు,దుప్పట్లు , భోజనాలు, తినుబండారాలు, పిల్లలకు బ్యాగ్‌లు,నోటు పుస్తకాలు వంటివిణ పంపిణీ చేసి వారిలో చైతన్యాన్ని నింపే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు.

# దొంగ ఓట్లతో... బిజెపి దొంగ ప్రభుత్వాలు

## కాంగ్రెస్ పార్టీ నేతలు రహమతుల్లా ఖాన్, పఠాన్ మహమ్మద్ అలీ ఖాన్ ధ్వజం

**కడప ఎడ్యుకేషన్ మేజర్‌న్యూస్ :** కడప నగరంలో మంగళవారం 31వ కాంగ్రెస్ పార్టీ డివిజన్ ఇంచార్జ్ మయాన రహమతుల్లా ఖాన్ ఆధ్వర్యంలో స్థానిక రెండవ గాంధీ విగ్రహం వద్ద ఓట్ చోర్ - గద్ది చోడ్(ఓట్ల దొంగ గద్దె దిగు) లో భాగంగా ప్రజల సంతకాల సేకరణ శిబిరాన్ని వారు ఆరంభించి మాట్లాడారు. ఆల్ ఇండియా కాంగ్రెస్ కమిటీ పిలుపుమేరకు రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధ్యక్షురాలు వై.ఎస్. షర్మిల రెడ్డి ఆదేశాల మేరకు ఓట్ల బిజెపి దొంగతనానికి వ్యతిరేకంగా ప్రజల సంతకాల సేకరణ విజయ వంత మైందన్నారు. ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలో ఇప్పటివరకు మూడుసార్లు కేంద్రంలో భారతీయ జనతా పార్టీ కేవలం దొంగ ఓట్ల ద్వారానే ప్రభుత్వాలు ఏర్పాటు చేసినట్లు ఆరోపించారు. కేంద్ర ఎన్నికల సంఘంతో భారతీయ జనతా పార్టీ కుమ్మక్కై ప్రజల తీర్పును అపహాస్యం చేసిందని విమర్శించారు. దేశంలోని ప్రజాస్వామ్యాన్ని హత్య చేసిన ఘనత నరేంద్ర మోడీకి దక్కుతుందన్నారు. దేశంలో అశాంతిని రెచ్చగొట్టి, ఆర్థిక వ్యవస్థను ధ్వంసం చేసి, మతవిద్వేషాలు వ్యాప్తి చేస్తూ తద్వారా అధికారాన్ని నిలుపుకునేందుకు మోడీ పడుతున్నాడన్నారు. లోక్సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఇటీవల భారతీయ జనతా పార్టీ చేస్తున్న దొంగ ఓట్ల కుంభకోణాన్ని



బహిర్గతం చేయడంతో బిజెపి నాయకులు ఆయనపై కక్షగట్టారన్నారు. ఇటీవల భారతీయ జనతా పార్టీ నేత మహదేవ్ కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ చాతిలో బుల్లెట్ దించుతామని బహిరంగంగా టీవీ ఛానల్ కు చెప్పడం ఆ పార్టీ దిగజారుడుతనానికి నిదర్శనం అన్నారు. బిజెపి నాయకులు రాహుల్ గాంధీ ని టార్గెట్ చేయడాన్ని కాంగ్రెస్ పార్టీ ఖండిస్తోందన్నారు. ప్రజలు త్వరలో నరేంద్ర మోడీ, అమిత్ షాకు భారతీయ జనతా పార్టీకి తగిన గుణపాఠం నేర్పిస్తారని హెచ్చరించారు. అనంతరం కడపలో ప్రజల సంతకాల సేకరణకు విశేష స్పందన లభించిందని చెప్పారు. కడపలో మరిన్ని ప్రాంతాల్లో ప్రజల నుంచి సంతకాలు సేకరించి అధిష్టానానికి నివేదిస్తామన్నారు.

# బొజ్జ బాలయ్య పార్థివదేహానికి నివాళు లర్పించిన విశ్వనాథరెడ్డి



**పోరుమామిళ్ల మేజర్‌న్యూస్ :** పోరుమామిళ్ల పట్టణం చిదానంద నగర్ నివాసి బొజ్జ బాలయ్య అనారోగ్య కారణాల వల్ల మృతిచెందారు. ఈ విషయం తెలుసుకున్న బద్వేల్ నియోజకవర్గ వైఎస్ఆర్సిపి అదనపు సమన్వయకర్త నల్లేరు విశ్వనాథ రెడ్డి వారి పార్థివ దేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. ఈ కార్యక్రమములో పోరుమామిళ్ల పట్టణం లోని వైఎస్ఆర్సిపి ముఖ్య నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# ఏ.యల్. కాలనీలో స్మార్ట్ ఈ-రేషన్ కార్డు పంపిణీ




**చింతకొమ్మదిన్నె మేజర్‌న్యూస్ :** చింతకొమ్మదిన్నె మండలంలోని ఏ. యల్. కాలనీలో ఈ రోజు స్మార్ట్ ఈ-రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమం కమలాపురం నియోజకవర్గ ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి , టీడీపీ రాష్ట్ర సీనియర్ నాయకుడు నరసింహారెడ్డి గారి ఆదేశాల మేరకు జిల్లా యస్.టి.సెల్ అద్యక్షుడు తిరుపాల్ నాయక్, డీలర్ కేశవ్, బాపూజీ నాయక్ ఆధ్వర్యంలో చేపట్టారు.ఈ సందర్భంగా పలువురు లబ్ధిదారులకు స్మార్ట్ ఈ-రేషన్ కార్డులను అందజేశారు. ఈ స్మార్ట్ కార్డుల ద్వారా రేషన్ సరఫరాలో పారదర్శకత పెరిగి, అక్రమాలు నివారించబడి, నాణ్యమైన సరుకులు న్యాయమైన మోతాదులో ప్రజలకు అందుతాయని నాయకులు పేర్కొన్నారు. ఈ విధానాన్ని అమలు చేసిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు కు లబ్ధిదారులు, స్థానిక నాయకులు హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు.

# దివ్యాంగులకు గృహోపకరణాలు వితరణ

## సేవాతత్పరుడు కిరణ్ కుమార్ ఆదర్శప్రాయుడు



**పులివెందుల మేజర్‌న్యూస్ :** చిన్న వయసులోనే వ్యాపారరంగంలో గణనీ యంగా రాణించి, తాను సంపాదించిన మొత్తంలో కొంతభాగాన్ని అనాథ, నిరుపేద, వికలాంగులకు వితరణగా ఇస్తూ, సమాజసే వాకా ర్యక్రమాలు చేపడుతున్న యువజన నాయకుడు కొర్రపాటి కిరణ్ కుమార్ నేటియు వతకు స్ఫూర్తిప్రదాత అని, ఆయన ఆయురారోగ్యాలతో, అష్టైశ్వర్యాలతో మరింత ఉన్నతస్థాయికి ఎదగాలని ఆకాంక్షిస్తున్నట్లు వికలాంగుల నెట్ వర్క్ రాష్ట్రఅధ్యక్షుడు ఇరికిరెడ్డి రఘునాథ రెడ్డి పేర్కొన్నారు. ప్రముఖ వ్యాపారవేత్త కొర్రపాటి కిరణ్ కుమార్ 42వ జన్మదినోత్సవ సందర్భంగా పట్టణంలోని ముద్దనూరు రోడ్డులో గల వికలాంగుల కమ్యూనిటీ భవనంలో ఏర్పాటుచేసిన ఒక కార్యక్రమంలో తండ్రి, విశ్రాంత ఆర్టీసీఉద్యోగి కొర్రపాటి ప్రభాకర్ వికలాంగుల మధ్య కిరణ్ బర్త్ డే కేక్ కట్ చేసి దివ్యాంగ చిన్నా రులకు అందించారు.అనంతరం కిరణ్ ఆర్థిక సహాయంతో 30మంది దివ్యాంగులకు కొర్రపాటి ప్రభాకర్ చేతుల మీదుగా గృహో పకరణాలు ( స్టీల్ క్యారియర్లు) పంపిణీ చేశారు. అనంతరం వికలాంగులకు స్వీట్లు, పండ్లు పంపిణీ అందించారు.ఈ కార్యక్రమంలో విశ్రాంత ఆర్టీసీ అధికారి కొర్రపాటి ప్రభాకర్, వికలాంగుల నెట్ వర్క్ అధ్యక్షులు రఘు నాథరెడ్డి, కార్యదర్శి ఆర్.వెంకటసుబ్బయ్య, సంఘ కార్యవర్గ సభ్యులు సునీల్, పాల్గొన్నారు.

# డిగ్రీ కోర్సులలో ప్రవేశాల గడువు పొడిగింపు

## ప్రిన్సిపాల్ డాక్టర్ శామ్యూల్ డేవిడ్ రాజ్



**పోరుమామిళ్ల మేజర్‌న్యూస్ :** 2025-26 విధ్యా సంవత్సరంనకు గానూ పోరుమామిళ్ల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్ల గడువు తేదీని రెండవ విడతలో భాగంగా సవరించిన షెడ్యూల్ ప్రకారం అభ్యర్థుల రిజిస్ట్రేషన్ అక్టోబర్ 3,సర్టిఫికెట్ల వెరిఫికేషన్ అక్టోబర్ 4,వెబ్ ఆప్షన్ల నమోదుకై అక్టోబర్ 6,ఆప్షన్లలో సవరణ కొరకు అక్టోబర్ 7,సీట్ల కేటాయింపు అక్టోబర్10,కాలేజీల్లో రిపోర్టింగ్ అక్టోబర్ 11 తేదీ అని ఒక ప్రకటనలో ప్రిన్స్పాల్ డాక్టర్ శామ్యూల్ డేవిడ్ రాజ్ పేర్కొన్నారు .

# దువ్వూరులో కన్యకా పూజా కార్యక్రమం



**దువ్వూరు, మేజర్‌న్యూస్ :** దువ్వూరు దసరా నవరాత్రి ఉత్సవాలలో భాగంగా మూలా నక్షత్రం రోజున దువ్వూరు శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానం నందు కన్యక పూజ కార్యక్రమం నిర్వహిం చారు. మంగళవారం మూలా నక్షత్రం సందర్భంగా చిన్నారులతో కన్యకా పూజ కార్యక్రమం నిర్వహించారు. చిన్నారుల తోపాటు ఆలయ పూజారి, ఆర్యవైశ్య కమిటీ సభ్యులు, మహిళ సభ్యులు పాల్గొ న్నారు.

# ప్రభుత్వం ఉల్లి రైతులను తక్షణం ఆదుకోవాలి

## అఖిలభారత రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షులు నారుపల్లె జగన్ మోహన్ రెడ్డి

**దువ్వూరు, మేజర్‌న్యూస్ :** జిల్లాలో సాగుచేసిన రైతులు ఉల్లి పంటను ప్రభుత్వం కొనుగోలు చేసి తక్షణం ఆదుకోవాలని అఖిల భారత రెడ్డి సంఘం రాష్ట్ర అధ్యక్షులు నారుపల్లె జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో అత్యధికంగా కర్నూలు, కడప జిల్లాలలో ఉల్లిపంట సాగు చేయడం జరుగుతుందన్నారు. కడప జిల్లాలో 20 వేల ఎకరాలకు పైగా ఉల్లిపంట సాగుచేశారు .ఒక ఎకరా ఉల్లిపంట సాగు చేయడానికి దాదాపు రూ 60 నుంచి 70 వేల రూపాయలు ఖర్చవుతుంది. ఎన్నడూ లేని విధంగా ఈ ఏడాది ఉల్లి ధరలు విపరీతంగా పడిపోయాయి. ఉల్లి ధర తగ్గిపోవడంతో అప్పులు తెచ్చి పంట సాగుచేసిన ఉల్లి రైతులు అయోమయంలో కొట్టుమిట్టాడుతున్నారు. విపత్తు సహాయ నిధి క్రింద క్వింటా ఉల్లికి రూ.1,200ల మద్దతు ధరతో కొనుగోలు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీ సాక్షిగా ప్రకటించింది. కాని అందుకనుగుణంగా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు జరగలేదు. అది కూడా ఇప్పుడు కేవలం కర్నూలు జిల్లాకు మాత్రమే అని చెబుతుండడంతో కడప జిల్లా రైతులు దిక్కుతోచని స్థితిలో ఆందోళన బాటపట్టారు.కడప జిల్లాలో దాదాపు 20 వేల ఎకరాలలో ఉల్లి సాగు చేసినట్టు ఉద్యాన శాఖ అధికారులు పంట నమోదు ద్వారా వెల్లడించారు. ఇప్పటికే రైతులు ఉల్లి ధర తగ్గిపోవడానికి తోడు రోజు కురుస్తున్న వర్షాలవల్ల తీవ్రంగా నష్టపోయారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన కనీసం మద్దతు ధర రూ.1,200లు సరిపోదు. దీనికితోడు కడప, జిల్లాలో పండించే ఉల్లి ప్రత్యేకమైన పంటగా జిల్లాలలోపేర్కొంటూ ఉద్యానవన శాఖాధికారులు ప్రభుత్వానికి నివేదిక ఇస్తున్నట్లు తెలుస్తోంది. ఇది సరైందికాదు. కడప, కర్నూలు రెండు జిల్లాలలో ఒకే రకమైన ఉల్లిని సాగు



చేస్తారనే విషయం అధికారులు గుర్తించాలి.కర్నూలు, కడప జిల్లాలలోనే కాకుండా రాష్ట్రంలో ఎక్కడ వేసిన ప్రతి ఉల్లి రైతును ఆదుకోవాలి. ఉల్లికి తగిన మద్దతు ధర ప్రకటించి, కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి, కొనుగోలు చేయాలి ఆయన కోరారు. పంట నష్టం జరిగిన ఉల్లి రైతులకు తక్షణమే నష్టపరిహారం అందించేందుకు తగు చర్యలు చేపట్టవలసిందిగా జగన్మోహన్ రెడ్డి కోరారు. కొన్ని గ్రామాలలో రైతులు పంట నూర్పిళ్ళు చేసి ఉల్లిగడ్డలు కోయకుండా అలాగనే పొలాలలో విడిచిపెట్టారు. ఇలాంటి రైతులను ప్రభుత్వం ఉద్యానవన అధికారులతో గుర్తించి ఆ రైతులకు నష్టపరిహారం చెల్లించాలని ప్రభుత్వాన్ని ఆయన కోరారు.

# మహిళా అదృశ్యం



**కలసపాడు మేజర్‌న్యూస్ :** కలసపాడు మండలంలోని దిగువ తంబళ్ల పల్లె గ్రామానికి చెందిన ఈస అంజలి 26సం తప్పిపోయిందని భర్త శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని కలసపాడు ఎస్సై ఎల్ తిమోతి తెలిపారు వివరాల్లోకి వెళితే ఈనెల 22వ తారీఖున పోరుమా మిళ్ళకు హొటల్లో పని చేసుకునే దానికి వెళ్లిందని ఇంటికి ఇప్పటివరకు తిరిగి రాలేదని చుట్టుపక్కల బంధువులు ఇండ్లలో విచారించామని ఎక్కడ ఆచూకీ తెలియకపోవడంతో పోలీస్ స్టేషన్ కు ఫిర్యాదు చేశామని భర్త శ్రీకాంత్ తెలిపారు ఎవరైనా ఆచూకీ తెలిస్తే ఈ నెంబర్కు 9121100632 ఫోన్ చేయవలసిందిగా కలసపాడు ఎస్సై ఎల్ తిమోతి తెలిపారు

# కార్యకర్తలకు అండగా డిజిటల్ బుక్ యాప్

## యువనేత నరేన్ రామాంజుల రెడ్డి



**చెన్నూరు మేజర్‌న్యూస్ :** వైసీపీ కార్యకర్తలకు అండగా నిలిచేందుకే డిజిటల్ బుక్ యాప్‌ను తీసుకొచ్చినట్లు వైసీపీ కమలాపురం నియోజకవర్గ ఇంచార్జ్ నరేన్ రామాంజుల రెడ్డి అన్నారు.మంగళవారం చెన్నూరులోని మండల యువజన విభాగ అధ్యక్షుడైన పేరుసాముల నిత్య పూజయ్య ఇంటి వద్ద కార్యకర్తలతో డిజిటల్ బుక్ పై అవగాహన కల్పించే కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.ఈ సందర్భంగా నరేన్ రెడ్డి మాట్లాడుతూ గ్రామ స్థాయిలో కమిటీల ద్వారా వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని బలోపేతానికి పార్టీ నాయకత్వం సమన్వయంతో ముందుకు వెళ్ళాలని కూటమి ప్రభుత్వం దగ్గర రెడ్ బుక్కు ఉంటే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వద్ద లైబ్రరీనే ఉందన్నారు.వాళ్ళ దగ్గర బుక్కు ఒక్కటేనని మన దగ్గర అలాంటి బుక్కులు ఎన్నో ఉంటాయన్నారు.డిజిటల్ బుక్కు కార్యకర్తలకు భరోసా ఇస్తూ అండగా ఉంటుందన్నారు.ఏది ఏమైనా ధృతరాష్ట్రుని పాలనను కలిసికట్టుగా పనిచేసే అంతమందిద్దామని ఆయన కార్యకర్తలకు పిలుపునిచ్చారు. డిజిటల్ బుక్ ద్వారా ఏ కార్యకర్తకు అన్యాయం జరిగిన అందులో నమోదు చేయవచ్చునని అది ఎలా చేయాలో ఆయన తెలిపారు. రాబోయే కాలంలో కార్యకర్తల ద్వారానే వైఎస్ఆర్ పార్టీ అభివృద్ధి కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు.ఏది ఏమైనా గ్రామస్థాయి నుండి కార్యకర్తలను బలోపేతం చేసి, అలాగే కష్టపడి పార్టీని ముందుకు తీసుకుపోవాలని ఆయన తెలిపారు.ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ జీఎన్ భాస్కర్ రెడ్డి,ఎంపీపీ సురేష్ యాదవ్,జెడ్పిటిసి దిలీప్ రెడ్డి,రాష్ట్ర మహిళా కార్యదర్శి భాగ్యమ్మ,మండల ప్రచార కమిటీ అధ్యక్షులు దేవగుడి భాస్కర్ రెడ్డి,యువ నాయకులు శ్రీకాంత్ రెడ్డి,చల్ల వెంకటసుబ్బారెడ్డి,సర్పంచ్ చంద్ర యాదవ్,ఎంపీటీసీ నాగిరెడ్డి,యూత్ ఉపాధ్యక్షుడు కార్తీక్ రెడ్డి,ద్వారకనాథరెడ్డి, పందు భాయ్ కార్యకర్తలు,వైసిపి అభిమానులు పాల్గొన్నారు.

# నూతన ఎస్పీ నచికేత్‌కు శుభాకాంక్షలు

## ఎస్పీని కలిసిన - ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి

కడప మేజర్‌న్యూస్ : ఇటీవల జిల్లా ఎస్పీగా బాధ్యతలు స్వీకరించిన షెల్క్ నచికేత్ విశ్వనాధ్ ను ఎమ్మెల్యే పుత్తా కృష్ణ చైతన్య రెడ్డి మంగళవారం మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు, ఈ సందర్భంగా జిల్లాలో శాంతి భద్రతలు, నేర నియంత్రణ, పోలీసులు ప్రజల మధ్య సంబంధాల మెరుగుదలపై ఇరువురు చర్చించారు..



# పోరుమామిళ్ల పంచాయితీలో అభివృద్ధి శూన్యం

## ధ్వజమెత్తిన జనసేన నాయకులు శీలంశెట్టి లక్ష్మయ్య

**పోరుమామిళ్ల మేజర్‌న్యూస్ :** పోరుమామిళ్ల మేజర్ పంచాయితీలో సమస్యలు గుట్టలు గుట్టలుగా వున్నాయని, సాధారణ కనీస అవసరాలకు కూడా ప్రజలు నోచుకోవడం లేదని జనసేన మండల నాయకుడు శీలం శెట్టి లక్ష్మయ్య మంగళవారం పోరుమామిళ్ల మేజర్ పంచాయితీపై ధ్వజమెత్తాడు. ఈ సందర్బంగా లక్ష్మయ్య మాట్లాడుతూ..పంచాయితీలోని అనేక సమస్యలను ప్రజలు మాదృష్టికి తీసుకురావడం జరిగిందని అన్నారు. రోడ్ల పరిస్థితి అయితే మరీ దారుణంగా ఉందని, సర్పంచ్ పదవీ కాలం కూడా ముగిసే సమయం దగ్గరకు వచ్చిందని అయినా పంచాయితీ అభివృద్ధి మాత్రం శూన్యం అని అన్నారు. ప్రజలకు సాధారణ సమస్యలు కూడా తీరడంలేదని, చెత్త సేకరణ, కాలువలు శుభ్రం చేయడం, బ్లీచింగ్ చల్లడం లాంటి చిన్న చిన్న పనుల కోసం కూడా ప్రజలు ముఖం వాచిపోయేలా ఎదురుచూస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎపుడో వారికి ఇష్టమైనప్పుడు చెత్త వ్యాను వీధుల్లోకి పంపిస్తుంటారని, డ్రైనేజీ వ్యవస్థను పట్టించుకొన్న పాపానా పోవడం లేదని లక్షుమయ్య అన్నారు. పంచాయితీలోని వీధుల్లో చాలా చోట్ల రోడ్ల పరిస్థితి దరిద్రంగా, దారుణంగా ఉందని, చినుకు పడితే ప్రజలు రోడ్ల మీద తిరుగలేక దారుణ పరిస్థితులు ఎదుర్కొంటున్నారని అన్నారు. ముఖ్యంగా సచివాలయం 2 నుంచి రామాయిపల్లి వెళ్లే రోడ్డు కిలోమీటర్ వరకు దాదాపు పదిహేను సంవత్సరాల నుంచి దుర్భర పరిస్థితిని ఎదుర్కొంటోందని, ఈ రోడ్డును వైసీపి హయాంలో పట్టించుకోలేదని, ఇప్పుడు కూటమి ప్రభుత్వం అధికారంలో వున్నా కూడా ఈ రోడ్డు అభివృద్ధి వైపు చూడడం లేదని లక్ష్మయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయితీకి నిధుల కొరత లేదని, సమృద్ధిగా వస్తున్నాయని అయినా అభివృద్ధి మాత్రం శూన్యం అన్నారు. కేవలం రోడ్ల నిర్మాణం కోసమే ప్రతి సంవత్సరం కోటి రూపాయలు నిధులు పంచాయితీకి వస్తాయని, ఇంకా 15 ఫైనాన్స్ అని సంవత్సరానికి అది ఒక కోటి రూపాయలు వస్తాయని, బిల్డింగ్ అప్రూవల్స్



అని, మనం కట్టే టాక్స్ లు అని రకరకాలుగా నిధులు చేకూరుతుంటాయని, అంతే కాకుండా ఎమ్ పి నిధులు, ఎమ్ ఎల్ ఏ నిధులు అంటూ రక రకాలుగా తెస్తుంటారని ఇవన్నీ ఎటు మళ్లుతున్నాయని, ఏమై పోతున్నాయని నిలదీశారు. ఇది ప్రజా దోపిడీ అని అన్నారు. సర్పంచ్, ఈఓ ప్రజలకు వివరణ ఇవ్వాలన్నారు. పంచాయితీ రాజ్ వ్యవస్థ మా నాయకుడు పవన్ కళ్యాణ్ ఆధీనంలో ఉందని, మా నాయకుడికి చెడ్డ పేరు రానివ్వమని, సమస్యను పవన్ కళ్యాణ్ వద్దకు చేరుస్తామని, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి లోకేష్ దృష్టికి కూడా తీసుకెళ్తామని అంటున్నారు లక్ష్మయ్య. వెంటనే పంచాయితీలోని రోడ్లన్నీ పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నగరి రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

# వేంపల్లె అమ్మవారి శాలలో శ్రీ మహిషా సురమర్ధిని అలంకారం...



సూర్య www.suryaa.com
KADAPA కడప జిల్లా
బుధవారం 01 అక్టోబర్ 2025

# ప్రభుత్వ విద్యారంగ బలోపేతానికి కృషి చేయాలి

## డిఎస్సీ ఉపాధ్యాయినులకు యుటిఎఫ్ పిలుపు



**కడప ఎడ్యుకేషన్, మేజర్‌న్యూస్ :** జిల్లాలోని వివిద కేజీబీవీ లలో పనిచేస్తూ 2025 మెగా డీఎస్సీ ఎగ్జామ్ రాసి మెరిట్ సాధించి ప్రభుత్వ ఉపాధ్యాయులుగా ఎన్నికైన ఉపాధ్యాయినిలను యుటిఎఫ్ కడప జిల్లా శాఖ అభినందించింది. మంగళవారం సాయంత్రం కడప యుటిఎఫ్ భవన్ లో జరిగిన సమావేశంలో కేజీబీవీ లలో పని చేస్తూ డీఎస్సీకి ఎంపికైన ఉపాధ్యాయినిలను ఉద్దేశించి యుటియఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి పాలెం మహేష్ బాబు మాట్లాడుతూ అకుంఠిత దీక్షతో ఒకవైపు విధులు నిర్వహిస్తూ మరొకవైపు కఠోర శ్రమతో ఆంధ్ర సివిల్స్ డిఎస్సీ పరీక్షల్లో ప్రతిభను చాటి పాఠశాల సహాయకులుగా ఎంపిక కావడం గర్వించదగ్గ విషయమన్నారు. జిల్లాలోని వివిధ కస్తూర్బా పాఠశాలలు .చాపాడు నుండి ప్రసన్నలక్ష్మి, కోడూరు నుండి మమోల, పెద్దముడియం నుండి మేరమ్మ, ఓబులమ్మ, గంగా శిరీష, మైదుకూరు నుండి హరిత, జమ్మలమడుగు నుండి కళావతి, గీత, వేముల నుండి నాగమల్లేశ్వరమ్మ, వల్లూరు నుండి పున్నమ్మ డీఎస్సీ లో మెరిట్ సాధించారన్నారు.ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఉపాధ్యాయులుగా ఎన్నికైన వారు హక్కులతో పాటు విధుల పట్ల అంకిత భావాన్ని కలిగి ఉండి ప్రభుత్వ విద్యారంగ బలోపేతానికి కృషిచేస్తూ బడుగు బలహీన వర్గాల అభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో యుటిఎఫ్ నాయకులు ఎడి దేవదత్తం తదితరులు పాల్గొన్నారు.

# మేఐహెల్ప్‌యు ఫౌండేషన్ ఆధ్వర్యంలో అనాథ శవానికి అంత్యక్రియలు



**ప్రొద్దుటూరు, మేజర్‌న్యూస్:** స్థానిక నేతాజీ నగర్‌లో నివసించే యం.సుబ్రమణ్యం అనే వృద్ధుడు అనారోగ్యం చేత మరణించగా అంతిమ సంస్కరణలు చేయడానికి బంధువులు ఎవరు రాకపోవడంతో స్థానికులు ఫోన్ ద్వారా మేఐహెల్ప్‌యు ఫౌండేషన్ టౌన్ ప్రెసిడెంట్ సుబహాన్‌ను సంప్రదించగా వారు వెంటనే స్పందించి మంగళవారం హిందు స్మశాన వాటికలో హిందూ సంప్రదాయం ప్రకారంగా అంతిమ సంస్కరణలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సెక్రటరీ నరేంద్ర కుమార్, టౌన్ వైస్ ప్రెసిడెంట్ మునీంద్రా, ట్రేజరర్ భార్గవ్ సాయి, నవీన్, బాల మురళీ, కృప ఆగ్ని షారూన్ ట్రస్ట్ సభ్యులు సుమన్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# చెకుముకి ద్వారా పిల్లల్లో ఆలోచనా విధానంలో తార్కికత

## చెకుముకి ఎడిటోరియల్ బోర్డ్ మెంబర్ యుగంధర్




**ప్రొద్దుటూరు, మేజర్‌న్యూస్:** చెకుముకి ద్వారా పిల్లల్లో ఆలోచనా విధానంలో తార్కికత పెరుగుతుందని చెకుముకి ఎడిటోరియల్ బోర్డ్ మెంబర్ యుగంధర్ అన్నారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర స్థాయి చెకుముకి ప్రశ్నాపత్రాల వర్క్ షాప్ రెండు రోజుల పాటు స్థానిక ప్రొద్దుటూరు జేవివి ఆఫీసు నందు నిర్వహించారు. ఈ వర్క్‌షాప్‌కు 5 జిల్లాల నుంచి రిసోర్స్ పర్సన్స్ వచ్చారు. ఈ సందర్భంగా యుగంధర్ మాట్లాడుతూ పిల్లల్లో శాస్త్రీయత పెంచడమే చెకుముకి లక్ష్యమని తెలిపారు. చెకుముకి సంబరాల ద్వారా విద్యార్థులలో సృజనాత్మకత పెరుగుతుందని, ఆలోచనా విధానంలో తార్కికత మెరుగవుతుందని వివరించారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర కార్యదర్శి శివరామ్ మాట్లాడుతూ గత 35 సంవత్సరాల నుండి 8,9,10 తరగతుల విద్యార్థులకు వివిధ స్థాయిలలో వారి టాలెంట్‌ను వెలికితీసే ప్రయత్నం చెకుముకి ద్వారా జరుగుతోందని తెలియచేశారు. జన విజ్ఞాన వేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ తవ్వా సురేష్ మాట్లాడుతూ ఈ సంబరాలలో సైంటిస్టులతో విద్యార్థుల ముఖాముఖి చర్చల ద్వారా వారిలో సైన్స్ పట్ల అభిరుచి పెరుగుతుందని, ప్రయోగాల ద్వారా ప్రతి అంశాన్ని నిశితంగా పరిశీలించడం అలవడుతోందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు బాల చైతన్య , మహేంద్ర రెడ్డి, ప్రకాశ్ రెడ్డి, జిలానీ బాషా, మాదాల రాము, సునీత, జిల్లా గౌరవ సలహదారులు గోపినాథ్ రెడ్డి, జిల్లా కార్యదర్శి రాజేష్, జిల్లా కమిటీ సభ్యులు సుబ్బయ్య, జెవివి నాయకులు తిరుమలకొండు, అల్లాబకష్, మురళీ గుప్త, శివనాథ్‌లు పాల్గొన్నారు.

# డివైఎఫ్ఐ ఆధ్వర్యంలో భగత్ సింగ్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

## అర్బన్ సీఐ లింగప్ప – మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి



**బద్వేల్, మేజర్‌న్యూస్ :** బద్వేల్ పట్టణంలోడివైఎఫ్ఐ పట్టణ కమిటీ అధ్వర్యంలోభగత్ సింగ్ జయంతి,దసరా పండుగను పురస్కరించుకొని భగత్ సింగ్ క్రికెట్ టోర్నమెంట్ ను స్థానిక బిజివేముల వీరారెడ్డి విద్యాసంస్థల క్రీడా మైదానం నందు భగత్ సింగ్ క్రికెట్ టోర్నమెంట్ ను బద్వేలు అర్బన్ సి ఐ లింగప్ప,మున్సిపల్ కమిషనర్ వి.వి నరసింహారెడ్డి టోర్నమెంట్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు సంయుక్తంగా మాట్లాడుతూ యువతకు ఉత్సాహభరితంగా,స్నేహపూర్వక వాతావరణంలో క్రికెట్ టోర్నమెంట్ డివైఎఫ్ఐ వారు నిర్వహించడం అభినందించదగ్గ విషయం అన్నారు.మానసిక,శారీరక దృఢత్వానికి క్రీడలు చాలా అవసరం అని,యువత చెడు వ్యసనాల వైపు వెళ్లకుండా మంచి ఆరోగ్యకరంగా ఉండాలని అన్నారు. డివైఎఫ్ఐ వారు నిర్వహిస్తున్న భగత్ సింగ్ క్రికెట్ టోర్నమెంట్ జయప్రదం కావాలని ఆకాక్షిస్తున్నామన్నారు.గొప్ప గొప్ప మహనీయుల జీవితాలను స్ఫూర్తిగా తీసుకుని యువత సన్మార్గంలో నడవాలని అన్నారు.డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు ముడియం చిన్ని మాట్లాడుతూ డివైఎఫ్ఐ సంఘము పోరాటాలే కాక యువతను చైతన్యవంతం చేయడానికి క్రీడా పోటీలు, ఆటలు వంటివి నిర్వహించడం జరుగుతుందని అన్నారు.స్వాతంత్ర పోరాట అమరుల స్ఫూర్తితో వారి ఆశయాలతో డివైఎఫ్ఐ యువజన సంఘం ముందుకు వెళ్లడం జరుగుతుంది అన్నారు.భగత్ సింగ్ క్రికెట్ టోర్నమెంట్ లో గెలుపొందిన జట్టులకు విన్నర్,రన్నర్ కు ప్రైజ్ మని ప్రముఖుల చేతుల మీదుగా అందించడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులుమాదనవిజయకుమార్,యంపెర్లు నజీమ్ భాష, వెంకటసుబ్బారెడ్డి,శివ, సునీల్ డివైఎఫ్ఐ పట్టణ అధ్యక్ష- కార్యదర్శులు షేక్ మస్తాన్ షరీఫ్, షేక్ ఆదిల్, పట్టణ నాయకులు యువరాజు, ఓబుల రెడ్డి,సుధాకర్, సుబ్రహ్మణ్యం, నాగేంద్ర, సురేష్ మరియు పెద్ద సంఖ్యలో క్రీడాకారులు పాల్గొన్నారు.

# డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ త్వరగా కొలుకోవాలి



**ప్రొద్దుటూరు, మేజర్‌న్యూస్:** ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ వైరల్ ఫీవర్ నుండి కొలుకొని ఆయురారోగ్యాలతో జీవించాలని మంగళవారం స్థానిక బొల్లవరం శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ప్రొద్దుటూరు జనసేన పార్టీ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రొద్దుటూరు పత్తి శివ కళ్యాణ్, బొల్లవరం వెంకటేశ్వర స్వామి దేవస్థాన పాలకమండలి సభ్యులు రామాజీ ప్రసాద్, మాదాసు మురళి, మంచి శివ, సుంకర మురళి, రామారావు, బాబ్జి, అశోక్, లక్ష్మణ్ సింగ్, జనసేన వీర మహిళ అయిషా, నాగ ముని, పాల్గొన్నారు.

# మహాసభల కరపత్రాలు విడుదల

## ఏఐటియూసి నేత బాదుల్లా

**వేంపల్లె మేజర్ న్యూస్:** మధ్యాహ్న భోజన పథకం కార్మికుల యూనియన్ రాష్ట్ర మహాసభల కరపత్రాలు విడుదల చేసినట్లు ఏఐటియూసి జిల్లా నేత బాదుల్లా అన్నారు. మంగళవారం స్థానిక జడ్పీ ఉర్దూ ఉన్నత పాఠశాలలో ఈ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం బాదుల్లా మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా 86 వేల మంది మహిళా కార్మికులు మధ్యాహ్న భోజన పథకంలో పనిచేస్తున్నట్లు తెలిపారు. పథకాల పేర్లు, ప్రభుత్వాలు మారుతున్న కార్మికుల బతుకు మారడం లేదన్నారు. కూటమి ప్రభుత్వం సెంట్రలైజ్ కిచెన్ పేరుతో ప్రైవేటీకరణ చేసేందుకు కుట్ర పడిందన్నారు. దీనికి వ్యతిరేకిస్తున్నట్లు వెల్లడించారు. ఆయా సమస్యలపై రాష్ట్ర మహాసభల్లో కార్యచరణ రూపొందిస్తామని, ప్రభుత్వాలు అవలంభిస్తున్న వ్యతిరేక విధానాలకీ నిరసన పోరాటం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు రియాజ్, గౌసియ, మున్ని తదితరులు పాల్గొన్నారు.



దసరా బ్రహ్మోత్సవాల సందర్భంగా బద్వేల్ పట్టణంలో వెలసి ఉన్న శ్రీ భద్రకాళి సమేత వీరభద్ర దేవస్థానం నందు తొమ్మిదవ రోజు అష్ట పూజ దుర్గాదేవి అలంకారంలో భక్తులకు దర్శనం ఇచ్చారు.



దేవీ నవరాత్రుల బ్రహ్మోత్సవాల సందర్భంగా బద్వేల్ శ్రీ ఆర్యవైశ్య వర్తక సంఘం ఆధ్వర్యంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానము దర్శనమిచ్చిన శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారు.



బద్వేల్ పట్టణంలో శ్రీ మహాలక్ష్మి దేవస్థానంలో దసరా ఉత్సవాల్లో భాగంగా ధైర్యలక్ష్మి అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.



కడప జిల్లా బద్వేల్ పట్టణంలో శ్రీ కోదండరామ స్వామి దేవస్థానంలో లక్ష్మీదేవి అలంకారంలో స్వామివారి భక్తులు దర్శనమిచ్చారు



బి. మఠంలో శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి దేవస్థానంలో శ్రీ మహిషాసుర మర్దిని దేవి అలంకరణలో భక్తులకు దర్శనం ఇస్తున్న శ్రీ వాసవి మాత

# పెళ్లికి నిరాకరించాడని ప్రియురాలు ఆత్మహత్య.



**పోరుమామిళ్ల మేజర్‌న్యూస్:** పోరుమామిళ్ల మండలం ఈదుల పల్లె గ్రామానికి చెందిన లక్కినేని దేవరాజ్ (28) అలాగే పోరుమామిళ్ల గిరినగర్‌కు చెందిన అనకర్ల నిఖిల (23)లు ఇరువురు గత ఎనిమిది సంవత్సరాల నుండి ప్రేమించుకుం టున్నారు. దేవరాజ్ పెళ్లికి నిరాకరించడంతో నిఖిల మనస్థాపం చెంది పోరుమామిళ్ల పోలీస్ స్టేషన్ ఆవర ణంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యయత్నం చేసు కుంది. అనంతరం నిఖిలను పోరుమామిళ్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమంగా మారడంతో వైద్యుల సలహా మేరకు కడప రిమ్స్‌కు తరలించారు.

## మహిషాసుర మర్దిని దేవి అలంకారంతో వాసవి మాత దర్శనం

### కూస్మాండ బలితో శరన్నవరాత్రి 9వ రోజు విశేష పూజలు



**వల్లూరు, మేజర్‌న్యూస్ :** మండల పరిధిలోని వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారి శాలలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం 9వ రోజు అమ్మవారికి ప్రత్యేక పూజలు ఘనంగా నిర్వహించారు, ఉదయం మూలవిరాట్ వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారికి పంచామృతాభిషేకంతో పాటు వివిధ విభూతులతో శోభాయమానంగా అలంకరించారు, ఈ సందర్భంగా సాయంత్రం అమ్మవారు మహిషాసుర మర్దిని దేవి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు, అలంకార దర్శనం కోసం భక్తులు తరలివచ్చారు, ఆలయ పరిసరాలలో భక్తులతో భక్తిశ్రద్ధలతో మార్మోగిపోయాయి, అలాగే ప్రత్యేకంగా కూస్మాండ బలి సమర్పించడం విశిష్టమైన అంశం, ఇది నవరాత్రి 9వ రోజు ప్రత్యేకంగా చేయబడే ఆచారం, రాత్రి సమయంలో మంత్రపుష్పం, దస మంగళహారతులు నిర్వహించి అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్ని కార్యక్రమాలు శాస్త్రోక్తంగా, భక్తిశ్రద్ధలతో నిర్వహించబడ్డాయి.

## గ్రామదేవతకు దుర్గాష్టమి వేడుకలు

### మహిసాసురమర్దని అలంకారం




**రాజుపాళెం, మేజర్‌న్యూస్:** దేవి శరన్నవరాత్రుల్లో భాగంగా మండల కేంద్రమైన రాజుపాళెంలో వెలిసి ఉన్న గ్రామ దేవత అంకాలమ్మ మంగళవారం మహిసాసుర మర్దిని అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు ఉదయం 9 గంటలకు దుర్గాదేవి హోమం మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం రాత్రి బొమ్మ దున్నపోతు గ్రామోత్సవం తదితర కార్యక్రమాలను నిర్వహించారు. గ్రామంలో పెద్ద ఎత్తున మహిళలు ప్రజలు దుర్గాష్టమి వేడుకల్లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## శ్రీమహిషాసురమర్దిని దేవి అలంకారం

### వేంపల్లెలో ఘనంగా దుర్గాష్ఠమి

**వేంపల్లె, మేజర్‌న్యూస్:** శ్రీమహిషాసురమర్దిని దేవి అలంకారంతో వాసవిమాత భక్తులకు దర్శనమిచ్చినట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తోటంశెట్టి చంద్రశేఖర్ వెల్లడించారు. మంగళవారం ఇంద్రకంటి ప్రసాద్ శర్మ నేతృత్వంలో విశేష పూజలు నిర్వహించారు. దున్నపోతు బొమ్మను తయారు చేసి ఊరేగింపుగా తీసుకెళ్లి అమ్మవారి ముందు బలిచ్చారు. అలాగే మహిళా మండలి ఆధ్వర్యంలో కోలాటం చేశారు. మహిళలు, పిల్లలకు ఆటల పోటీలు నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షుడు రాయవరం సుబ్బు, మహిళా మండలి అధ్యక్షురాలు బచ్చు భాగేశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

## నగరంలో పోలీస్ స్టేషన్లను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ

(మొదటి పేజీ తరువాయి)

సిబ్బందికి సూచించారు. స్టేషన్ పరిసరాలను పరిశీలించి ఎక్కడ అపరిశుభ్రత లేకుండా చూడాలని సిబ్బందిని ఆదేశించారు. దసరా ఉత్సవాల సందర్భంగా జిల్లాలోని దేవాలయాల వద్ద తగిన బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు ఎస్.పి తెలిపారు. కమాండ్ కంట్రోల్ సెంటర్ నుండి శాంతిభద్రతలను పర్యవేక్షించడం జరుగుతుందన్నారు, పోలీస్ అధికారులు అప్రమత్తంగా ఉంటూ నేరాలు జరగకుండా నిఘా పెట్టాలని తెలిపారు . జిల్లా ప్రజలు పోలీసు శాఖకు సహకరించాలని కోరారు. వన్ టౌన్ పోలీస్ స్టేషన్ పైన ఉన్న కమాండ్ కంట్రోల్ సెంటర్‌ను సందర్శించి సిబ్బంది ఎంతమంది ఉన్నారని అడిగి తెలుసుకున్నారు. బ్లూ కోల్ట్, రక్షక్ సిబ్బంది ఎంతమంది ఉన్నారని ఆరా తీశారు. నగరంలోని సి.సి కెమెరాల పనితీరు, ఎల్.హెచ్.ఎం.ఎస్ కెమెరాలు, డయల్ 112 గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వీడియో వాల్ పరిశీలించారు. అనంతరం టూ టౌన్ పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేశారు. పెండింగ్ కేసులు త్వరితగతిన విచారించి పరిష్కరించాలని టూ టౌన్ సి.ఐ సుబ్బారావును ఆదేశించారు. టూ టౌన్ పరిధిలో నేరాల నివారణకు గస్తీ పెంచాలని ఎస్.పి ఆదేశించారు. స్టేషన్ కు వచ్చే ఫిర్యాదు దారుల పట్ల సమస్యను సావధానంగా విని చట్ట పరిధిలో న్యాయం చేయాలని తెలిపారు.

# వైభవంగా దుర్గాష్టమి మహోత్సవాలు





**ప్రొద్దుటూరు, మేజర్‌న్యూస్:** పట్టణంలో మంగళవారం తొమ్మిదవ రోజు ఉత్సవాలలో భాగంగా దుర్గాష్టమి, కుష్మాండ బలి నిర్వహించారు.

**అమ్మవారిశాలలో**

దసరా శరన్నవరాత్రి మహోత్సవాలలో భాగంగా మంగళవారం తొమ్మిదవ రోజు మెయిన్ బజార్ లోని అమ్మవారిశాల నందు వాసవాంబకు మహిషాసుర మర్దిని దేవి అలంకారం నిర్వహించారు. ముందుగా ఉదయం శ్రీ దుర్గా హోమము, శ్రీ దేవీ పంచసూక్త హోమము, శ్రీ ధన్వంతరి హోమము, శ్రీ వాసవీ మాత మూల మంత్ర నిత్య హోమం, ధన్వంతరి యంత్రార్చన, రాత్రి దీక్షా హోమము, శ్రీ చండీ నవావరణ యంత్రార్చన, స్వర్ణ చత్రమేరువుకు సుష్క ఫలాలతో అర్చన నిర్వహించారు. రాత్రి వాసవీమాతకు సరస్వతి దేవి అలంకారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాల్గొన్న భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

**లలితాదేవి రతనాల వెంకటేశ్వర స్వామి ఆలయంలో**

స్థానిక పాత మార్కెట్ లోని లలితాదేవి రతనాల వెంకటేశ్వర స్వామి ఆలయంలో నిర్వహిస్తున్న దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలలో భాగంగా మంగళవారం తొమ్మిదవ రోజు అమ్మవారికి మహిషాసుర మర్దిని దేవి అలంకారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం శ్రీ ఆవాహిత దేవతా దుర్గా హోమము, సాయంత్రం వాస్తు మండల యంత్రారాధన, రాత్రి లలితాదేవికి మహిషాసుర మర్దిని దేవి అలంకారం నిర్వహించారు. ఈ సందర్భంగా పాల్గొన్న భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

**రాజరాజేశ్వరీ దేవి ఆలయంలో**

స్థానిక శాస్త్రి నగర్ లోని రుణవిమోచనేశ్వర సమేత రాజరాజేశ్వరీ దేవి ఆలయంలో నిర్వహిస్తున్న దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలలో తొమ్మిదవ రోజు మంగళవారం మహిషాసుర మర్దిని దేవి అలంకారం నిర్వహించారు. ఉదయం దీక్షా హోమా పూర్వక శ్రీ దూర్గా సూక్త హోమ మహన్యాస పూర్వక లఘు పూర్ణాహుతి, రాత్రి శ్రీ చండీ నవ యంత్రార్చన నిర్వహించారు. రాత్రి అమ్మవారికి మహిషాసుర మర్దిని దేవి అలంకారం, కుష్మాండ బలి నిర్వహించారు. ఈ సందర్భంగా పాల్గొన్న భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

**రామలింగేశ్వర స్వామి ఆలయంలో**

స్థానిక రామేశ్వరం లో సాక్షాత్తు శ్రీరామచంద్రునిచే ప్రతిష్టితమైన ముక్తి రామలింగేశ్వర స్వామి ఆలయంలో యజ నిర్వహిస్తున్న దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలలో భాగంగా తొమ్మిదవ రోజు మంగళవారం అమ్మవారికి మహిషాసుర మర్దిని దేవి అలంకారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉదయం అభిషేకాలు, సాయంత్రం కుంకుమార్చన, ఉదయం స్వామి మరియు అమ్మ వారికి పంచామృతాభిషేకము కార్యక్రమములు ప్రసాద వితరణ నిర్వహించడంతో పాటు సాయంత్రం మహిషాసుర మర్దిని దేవి అలంకారం నిర్వహించారు.

**అగస్త్యేశ్వరాలయంలో**

పట్టణ నడిబొడ్డున వున్న అగస్త్యేశ్వరాలయంలో మంగళవారం తొమ్మిదవ రోజు దసరా శరన్నవరాత్రి మహోత్సవాలలో భాగంగా మహిషాసుర మర్దిని దేవి అలంకారం నిర్వహించారు. ఉదయం ప్రత్యేక హోమాలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం రాత్రి మహిషాసుర మర్దిని దేవి మూలమంత్ర హోమం నిర్వహించారు. అదేవిధంగా భక్తుల సందర్శనార్థం మహిషాసుర మర్దిని దేవి అలంకారం, కుష్మాండ బలి, మహిష వద నిర్వహించి పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

**సూపర్ బజార్ రోడ్డులో**

స్థానిక సూపర్ బజార్ రోడ్డు లోని చౌడేశ్వరి అమ్మవారి ఆలయంలో ఆదివారం దసరా శరన్నవరాత్రి మహోత్సవాలలో భాగంగా మహిషాసుర మర్దిని దేవి అలంకారం నిర్వహించారు. ఉదయం ప్రత్యేక హోమాలు, అభిషేకాలు నిర్వహించారు. అనంతరం రాత్రి భక్తుల సందర్శనార్థం మహిషాసుర మర్దిని దేవి అలంకారం నిర్వహించి పాల్గొన్న భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

## మహిషాసురమర్దిని అలంకారంలో అమ్మవారు



**దువ్వూరు, మేజర్‌న్యూస్:** మండల కేంద్రమైన దువ్వూరులో శరన్నవరాత్రుల ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి మంగళవారం నాటికి 9వ రోజుకు చేరాయి. ఉదయం వేద పండితులచే చండీయాగం నిర్వహించారు. శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవారుశ్రీ దుర్గాదేవి (శ్రీ మహిషాసురమర్ధిని) అవతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం నుంచి భక్తులు అమ్మవారిని దర్శించుకునేందుకు బారులు తీరారు. దుర్గాదేవి అలంకారానికి ఎంతో విశిష్టత ఉంది. దుర్గతులను రూపుమాపే దుర్గా అవతారంతో దుర్గమాసురుడు అనే రాక్షసుడిని అష్టమి తిథి రోజున సంహారించింది. అందుకే దుర్గగా కీర్తించబడుతుంది. నవరాత్రులలో వచ్చే అష్టమిని దుర్గాష్టమిగా పిలుస్తారు. దుర్గాష్టమి నాడు దుర్గాదేవిగా (శ్రీమహిషాసుర మర్దిని) భక్తులకు దర్శనమీయడంలో ఎంతో ప్రాచుర్యత దాగి ఉంది. దుర్గాదేవిని దర్శించుకుంటే దుర్గతుల నుంచి తప్పించుకోవచ్చని భక్తుల ప్రగాఢ విశ్వాసం. లోక కంఠకుడైన దుర్గమాసురుడు అనే రాక్షసుడిని సంహరించి దుర్గతులను పోగొట్టి దుర్గగా వెలుగొందుతూ స్వయంగా అష్టమి తిథినాడు ఆవిర్భవించింది. అందుకే దుర్గాష్టమిగా పిలువబడుతుంది. అమ్మవారు త్రిశూలంధరించి సింహాసనంపై అధిష్టించి ఉంటుంది. బంగారు కిరీటాన్ని ధరించి ఆమె తన కాలికింద దుర్గమాసురుడు మహిషురుణ్ని తొక్కిపట్టి ఉంచుతూ దర్శనమిస్తుంది. అష్టమి రోజు దుర్గాదేవి దర్శనం కోసం భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తారు. దుర్గాష్టమి నాడు అమ్మవారిని దర్శించుకుంటే దుర్గతులు పోయి సద్గతులు ప్రసాదించబడతాయని భక్తుల విశ్వాసం. చిన్నారులు ఆర్యవైశ్య మహిళా మండలి ఆధ్వర్యంలో కన్యకా పూజ నిర్వహించారు. మండలంలోని గ్రామాల నుంచి పెద్ద ఎత్తున భక్తులు వచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. వచ్చిన భక్తులందరికీ తీర్థ ప్రసాదం అందించినట్లు ఆర్యవైశ్య కమిటీ చైర్మన్ అరవేటి సుబ్బారావు, ఆలయ అర్చకులు లక్ష్మీ నరసింహ మూర్తిశర్మలు తెలిపారు.

## మహిషాసుర మర్దిని అలంకారంలో శ్రీ చౌడేశ్వరి అమ్మవారు



**చెన్నూరు మేజర్‌న్యూస్:** మండల కేంద్రమైన పడమటి వీధిలో శరన్నవరాత్రుల ఉత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి మంగళవారం మహిషాసుర మర్దిని అలంకారంలో చౌడేశ్వరి అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.

## జయహే మహిషాసుర మర్దిని



**ఎర్రగుంట్ల, మేజర్‌న్యూస్:** దేవీ నవరాత్రులలో భాగంగా ఆలయాలలో మహిషాసుర మర్దిని అలంకరణలో అమ్మవారు దర్శనమిచ్చారు. మంగళవారం పట్టణ పరిధిలో ని నడివురిలో వెలిసిన శ్రీ మహా అంకమ్మ తల్లి, ముద్దనూరు రోడ్డులో వెలసిన శ్రీ చౌడేశ్వరి దేవి అమ్మవారు, ఏరువాక గంగమ్మ ఆలయాలలో మహిషాసుర మర్దిని అలంకరణలో భక్తులకు అమ్మవారి దర్శనమిచ్చారు. ప్రత్యేక అలంకరణతో పాటు పూజలు నిర్వహించారు. అష్ట భుజాలతో దుష్టుడైన మహిషాసురుడిని అమ్మవారు సంహరించింది ఈ రూపంలోనే. అందుకే ఇది నవదుర్గ ల్లో అత్యుగ్రరూపం. ఆయుధాలను ధరించిన మహాశక్తిగా భక్తులను సాక్షాత్కరిస్తుందనీ భక్తుల విశ్వాసం. అమ్మవారికి అభిషేకం కుంకుమార్చన పూజలు పూల అలంకరణ నిర్వహించారు. ఆలయ పురోహితులు భక్తులకు తీర్థ ప్రసాదాలు అందజేశారు. అనంతరం ఆలయ కమిటీ నిర్వాహకులు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

## జీవితాన్ని మార్చే శక్తివంతమైన ఆయుధం విద్య

### నాయీ బ్రాహ్మణ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు బాలయ్య




**కడప టౌన్, మేజర్‌న్యూస్ :** దీన స్థితి నుంచి..ఉన్నత స్థానాలకు చేర్చే అత్యంత శక్తివంతమైన ఆయుధం విద్యనే అని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎస్. బాలయ్య, జిల్లా అధ్యక్షులు పత్తూరు గురుస్వామి లు అన్నారు. 2024-25 సంవత్సరానికి గాను ఎస్.ఎస్.సి., ఇంటర్మీడియట్, పాలిటెక్నిక్ విభాగాలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ శ్రేణిలో ఉత్తీర్ణులైన నాయీ బ్రాహ్మణ వర్గానికి చెందిన విద్యార్థులకు ఏపీ రాష్ట్ర నాయీ బ్రాహ్మణ సంక్షేమ సంఘం కడప జిల్లా శాఖ ఆధ్వర్యంలో బీ.సీ. భవన్ లో మంగళవారం ప్రోత్సాహక బహుమతులు అందజేశారు.ఈ సంధర్భంగా వారు మాట్లాడుతూ తమ సామాజిక వర్గానికి,సంఘం ద్వారా శక్తి మేరకు అనేక సేవా కార్యక్రమాలు చేస్తున్నామని చెప్పారు.అందులో భాగంగా కొన్ని సంవత్సరాలుగా క్రమం తప్పకుండా ఏటా నాయీ బ్రాహ్మణుల పురోగతి కోసం వైద్య శిబిరాలు,క్యాలెండరు ఆవిష్కరణ, వివాహ పరిచయవేదిక తదితర కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.అలాగే చదువులో ప్రతిభ చాటిన విద్యార్థులకు ప్రోత్సాహకబహుమతులు అందిస్తున్నామన్నారు. నేటి బాలలే రేపటి పౌరులని కావున విద్యార్థులు పాఠశాల, కళాశాల స్థాయి నుంచే పట్టుదల, క్రమశిక్షణతో విద్యనభ్యసించగలిగితే ఇటు తల్లిదండ్రులకు, అటు చదువుకున్న పాఠశాల, కళాశాలకు మంచి పేరు తీసుకురావడంతో పాటుగా మంచి ఉద్యోగం సంపాదించుకోగలరన్నారు. తద్వారా మీ జీవితాలలో ఆనందపు కాంతులు పూయగలవన్నారు. కావున ప్రతీ విద్యార్థి కష్టంతో కాకుండా ఇష్టంగా చదివి సమాజంలో ఉన్నత స్థానం సంపాదించుకుని ఇతరులకు మార్గదర్శకంగా ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం పదవతరగతి, ఇంటర్, పాలిటెక్నిక్ విభాగాలలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన దాదాపు 26 మంది విద్యార్థినీ, విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో వర్కింగ్ ప్రెసిడెంట్ ఎం.సి. గుర్రప్ప, సంఘం నాయకులు చంద్రశేఖర్, ఆదినారాయణ, ఎన్. శేఖర్, తదితరులు పాల్గొన్నారు.

# అనారోగ్యముతో బాధపడుతున్న కళాకారున్ని ఆదరించండి

### చెక్కభజన కళాకారుడు అన్న ఆరోగ్యంతో మంచానికే పరిమతం...

### ఆదుకునే వారి కోసం ఎదురుచూపులు..



**బద్వేల్, మేజర్‌న్యూస్ :** అనారోగ్యముతో బాధపడుతున్న కళాకారున్ని ఆదరించండి ఆదుకోండిఅంటూ కాశినాయన మండలం నాయనపల్లి గ్రామానికి చెందిన మున్నేలి ఓబులేష్ చెక్కభజన కళాకారుడు అనాఆరోగ్యంతో మంచానికే పరిమితమై ఆదుకునే వారి కోసం ఎదురుచూపులు చూస్తూ చూస్తున్నాడు. వివరాల్లోకి వెళితే మున్నెల్లి ఓబులేసు చిన్నతనంలోనే తల్లిని పోగొట్టుకొని మేకలకు, గొర్రెలకు పోతూ అడవిలలో పాటలు పాడుతూ 14 సంవత్సర వయసులోనే చెక్కభజన పై ఇష్టముతో తను ఒక పాట పాడితే కోకిలమ్మ గానం చేసినట్లే, తను నాట్యం చేస్తే నెమలి చేసినట్లు చాలా మధురంగా ఉంటుంది తన గానం తన సొంత నాయనపల్లి గ్రామంలో చిన్న వయసులోనే ఒక గురువు దగ్గర చెక్క భజన నేర్చుకోవడం జరిగింది మొదటి గురువుగా వరికుంట్ల,నాయనపల్లి రాయలసీమ జిల్లాల్లో నెల్లూరు , ప్రకాశం, గుంటూరు పలు జిల్లాలలో చెక్కభజన నేర్పించడం జరిగింది ఎంతో మందిని ఆయన చెక్క భజన శిష్యులుగా తయారు చేశారు బద్వేలు నియోజకవర్గం మాజీ మంత్రి స్వర్గీయులు బిజీ వేముల వీరారెడ్డి దగ్గర కూడా అవార్డు తీసుకోవడం జరిగింది ఎంతోమంది మంత్రులు, ఎమ్మెల్యేల దగ్గర చెక్క భజన అవార్డు తీసుకున్నారు కానీ ప్రభుత్వం గుర్తించబడినటువంటి ఇలాంటి కళాకారులకు అవార్డును కూడా రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేయాలని చెక్కభజన గానకోకిల గురువు మున్నెల్లి ఓబులేసు మంచి పేరు ప్రతిష్టలు పొందినటువంటి వ్యక్తికి ప్రభుత్వం గుర్తించి తగు న్యాయం చేయాలి కడప జిల్లా అంటే కళాకారులకు పుట్టిన నిలయం ఎంతోమంది మహానుభావులు కళాకారులు,మేధావులు ఉన్నారు ఎక్కడో ఒక మారుమూల గ్రామంలో ఇప్పటికీ ఆ గ్రామంలోకి సరైనటువంటి బస్సు సౌకర్యాలు కూడా లేవు అలాటి గ్రామంలో చెక్క భజన కళాకారుడు గ్రామం నుండి ఉన్నత స్థాయికి రావడం అనేది కళామతల్లి ముద్దుబిడ్డ చెక్క భజన గాన కోకిల గురువు మున్నెల్లి ఓబులేసు గత మూడు సంవత్సరాల నుండి వింతైన వ్యాధితో బాధపడుతూ దాదాపుగా 14 లక్షల వరకు ఖర్చు అయినది తన ఫ్యామిలీ కష్టాలలో కొట్టి మీటాడుతూ ఓబులేసు గత రెండు నెలల నుండి ఆరోగ్యం బాగా లేక ఒక ప్రైవేట్ హాస్పిటల్ రేణిగుంట కరకంబాడి అమర్ హాస్పిటల్ తను సొంత ఖర్చులతో చికిత్స తీసుకుంటు న్నారు. ప్రభుత్వము ఎలాంటి సహాయం అందించలాని చెక్క భజన కళాకారుడుకి ప్రభుత్వం సహాయం చేయాలని తిరుమల తిరుపతి దేవస్థానం బ్రహ్మోత్సవాలకు, దసరా మహోత్సవం, కనకదుర్గమ్మ మ హొత్సవం,గోదావరి పుష్కరాలకు, ఇలా ఎన్నో చెక్క భజన ప్రోగ్రాం చేశారు ఇలాంటి వ్యక్తి కి ప్రభుత్వం వెంటనే స్పందించి వారికి న్యాయం చేయాలని అధికారి పాట్టి నాయకులు ఇలాంటి కళాకారులకు తగు న్యాయం చేస్తారని వారి కుటుంబంలో చదువుకున్న వారికి ఏదైనా ఉద్యోగ పరంగా న్యాయం చేస్తారని వారి కుటుంబాన్ని ఆదుకోవాలని ప్రభుత్వా న్ని వేడుకుంటున్నాను. దయ వుంచి ప్రతి పేదలు మరియు కళాకారులు ఆయా ప్రభుత్వ అధికారులు ప్రజా నాయకులు స్పందించి వెంటనే ఆయనకు సహాయం చేయ గలరని కుటుంబ సమేతంగా వే డ ు క ు ం ట ు న్నా ర ు. దయవుంచి పై ప్రభుత్వ అధికారులు ఉద్యోగస్తులు ప్రజా ప్రతినిధులు అందరు సహాయం చేయవలసిందిగా కళాకారుడు మనవి అభ్యర్థిస్తున్నాను.



# విద్యుత్ అంతరాయం

### నేటి నుండి నాలుగు రోజుల వరకు

**పోరుమామిళ్ల, మేజర్‌న్యూస్:** పోరుమామిళ్ళ పట్టణం నందు 33 %ఖు% మరియు 11 కె.వి. ఫీడర్లలో పునరుద్దరణ పనులు జరుగు చున్నందున, నేటి నుండి నాలుగు రోజుల పాటు, ప్రతి రోజు ఉదయం 09:00 గం ల నుండి మధ్యాహ్నం 03:00 గం ల వరకు విద్యుత్ సరఫరా నిలిపి వేయబడునని రవి చంద్రశేఖర్ డి ఈ ఈ మరియు వెంకట మహేష్ ఏఈఈలు తెలిపారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించి సహకరించ వలసినదిగా వారు విజ్ఞప్తి చేశారు.

## రేషన్ సరఫరాలో మోసాలు నివారించడమే లక్ష్యం

### టిడిపి సీనియర్ నేత మహమ్మద్ షబ్బీర్

**వేంపల్లె, మేజర్‌న్యూస్:** లబ్ధిదారులకు పంపిణీ చేసే రేషన్ సరఫరాలో మోసాలను నివారించడమే కూటమి ప్రభు త్వ లక్ష్యమని టిడిపి సీనియర్ నేత మహమ్మద్ షబ్బీర్ అన్నారు. మంగళవారం స్థాని క ఇమామ్ నగర్‌లో లబ్ధిదారులకు స్మార్ట్ రైస్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్యూఆర్ కోడ్ ఆధారిత స్మార్ట్ రేషన్ కార్డు వల్ల పౌరసరఫరాల వ్యవస్థలో పారదర్శకత సాధ్యపడుతుందన్నారు. వీటిని లబ్ధిదారులు సద్వినియోగ పరుచుకోవాలని కోరారు. టిడిపి నాయకులు భాస్కర్, మాబుషరీఫ్, యాసిన్, ఇలియాస్, గంగాధర్, మౌలా తదితరులు పాల్గొన్నారు.



## లింగాల మండల తాసిల్దార్ ఈశ్వరయ్య పదవీ విరమణ




**లింగాల మేజర్‌న్యూస్:** లింగాల మండలంలోని లింగాల తాసిల్దార్ తుమ్మాది ఈశ్వరయ్య మంగళవారం పదవి విరమణ కార్యాక్రమం నిర్వహించారు. ఎమ్మార్వో,ఈశ్వరయ్య 39 సంవత్సరాలు రెవిన్యూ కార్యక్రమంలో పాల్గొని అహర్నిశలు కష్టపడి ఒడిదుడుకులు తట్టుకొని ఎన్నో సమస్యలు ఎదుర్కొని ఇప్పుడు ఆయనకు పదవీ విరమణ జరిగింది. ఆయనకు వారి భార్యకు,పెద్ద ఎత్తున శాలువాలు కప్పి సత్కరించారు.ఈ కార్యక్రమంలో ఆర్డీవో, చిన్నయ్య, టీడీపీ ఇంచార్జ్ దేవిరెడ్డి సంజీవరెడ్డి, లింగాల మండల టీడీపీ అధ్యక్షులు ఎమ్మనూరు,విశ్వనాథ రెడ్డి పులివెందుల మార్కెట్ యార్డ్ చైర్మన్ గడ్డం అమర్నాథ, యాదవ్, లింగాల సొసైటీ అధ్యక్షుడు కర్ణ నవీన్ కుమార్ రెడ్డి, ఎండిఓ శ్రీనివాసరెడ్డి, లింగాల ఎంపీపీ అలవాడపాటి రమాదేవి, డిప్యూటీ తాసిల్దార్ నరేంద్ర, రీసర్వేర్ రమణారెడ్డి, రెవిన్యూ ఇన్స్పెక్టర్ గంగాధర్, లింగాల సర్వేర్, పార్వతి, వీఆర్వోలు,వీఆర్ఏలు, రేషన్ డీలర్లు, లింగాల మండలం ప్రజలు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

# పదవీ విరమణ చేసిన తహసిల్దార్ ఈశ్వరయ్యకు సన్మానం చేసిన విఆర్ఏ అసోసియేషన్ నాయకులు

**అట్లూరు, మేజర్‌న్యూస్:** కడప జిల్లా పులివెందుల రెవిన్యూ డివిజన్ పరిధిలోని లింగాల మండల తహసిల్దార్ గా పనిచేస్తున్న తుమ్మాది ఈశ్వరయ్య మంగళవారం పులివెందుల లోని రాయల్ ఫంక్షన్ హాల్ లో పదవీ విరమణ కార్యక్రమం నిర్వహించారు వారి ఆహ్వానం మేరకు ఎపీ విఆర్ఏ వెల్ఫేర్ అండ్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు నల్లిపోగు నాగేశం అసోసియేషన్ నాయకులతో కలిసి సన్మాన సభకు హాజరై ఆయను ఘనంగా సత్కరించారు అనంతరం ఎపీ విఆర్ఏ వెల్ఫేర్ అండ్ సర్వీస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు నల్లిపోగు నాగేశం మాట్లాడుతూ తాహశీల్దార్ తుమ్మాది ఈశ్వరయ్య సుదీర్ఘకాలం 39 సంవత్సరాలుగా రెవిన్యూ డిపార్ట్ మెంట్ లో పనిచేశారని పేద ప్రజల కష్టాలు తెలిసిన వ్యక్తి అని ప్రజలకు రైతులకు అనేక సేవలు అందించారని ఎన్ని ఒడి దుడుకులు ఎదురైనా ఆత్మవిశ్వాసంతో ధైర్యంతో ఎదుర్కొన్నారని ఆయన కొనియాడారు రెవిన్యూ శాఖలో జూనియర్ అసిస్టెంట్ గా నియామకం పొంది రెవెన్యూ ఇన్ స్పెక్టర్ గా తహశీల్దార్ గా రెవిన్యూ డివిజనల్ అధికారి కార్యాలయంలో అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్ గా వివిధ హొదాలలో ఆయన సుదీర్ఘకాలం ప్రభుత్వానికి సేవలు అందించారని ఆయన తెలిపారు ఆయన పనిచేసిన ప్రతి మండలంలోనూ ముఖ్యంగా విఆర్ఏ లను



తన కన్న బిడ్డల్లాగా తన ఒడిలో చేర్చుకొని తన ఆప్యాయతను చూపిన గొప్ప మనసున్న వ్యక్తి అని కొనియాడారు ఈ కార్యక్రమంలో రిటైర్డ్ తాహాశీల్దార్ ఎన్ ఆంజనయ్య విఆర్ఏలు భాస్కర్ శ్రీనివాసులు,గురు స్వామి , శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు